ఈనాడు
నంద్యాల
సోమవారం ఆగస్టు 31, 2026

సూక్ష్మ, చిన్న, మధ్యతరహా (ఎంఎస్ఎంఈ) పరిశ్రమలకు ప్రభుత్వం పెద్దపీట వేస్తోంది. యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించి వారిలో పారిశ్రామికశక్తిని నిలిపేలా చర్యలు చేపట్టింది. అందులో భాగంగా ప్రతి నియోజకవర్గంలో ఒక ఎంఎస్ఎంఈ పార్కు ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. ఈ దిశగా చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించింది. ఉమ్మడి జిల్లాలోని పలు ప్రాంతాల్లో శంకుస్థాపనలు సైతం జరిగాయి. పనులు వేగంగా పూర్తైతే యువత చాలా పెద్దఎత్తున ఉపాధి లభించనుంది. – న్యూస్‌టుడే, కర్నూలు కలెక్టరేట్


డోన్ నియోజకవర్గ పరిధిలోని జగదుర్తిలో ఎంఎస్ఎంఈ పార్కులో నిర్మించిన రహదారి

యువత.. పరిశ్రమలతో భవిత

- పలు ప్రాంతాల్లో ఎంఎస్ఎంఈ పార్కుల ఏర్పాటు
- పనులు పూర్తైతే వేలాది మందికి ఆసరా

ప్లాట్లుగా విభజించి..

ఎమ్మిగనూరు మండలం బనవాసిలో మొత్తం 77.37 ఎకరాలు కేటాయించగా అందులో 24.39 ఎకరాల్లో టెక్స్‌టైల్ పార్కు ఏర్పాటుకు 2025, మే 6న శంకుస్థాపన చేశారు. ఇక్కడ 70 శాతం మేర అభివృద్ధి పనులు పూర్తయ్యాయి. ఇక్కడ వివిధ విస్తీర్ణంలో ప్లాట్లను విభజించి ఏపీఐఐసీ వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచారు.

పాణ్యం నియోజకవర్గ పరిధి.. ఓర్వకల్లు మండలంలోని మీదివేముల, గుట్టపాడులో ఎంఎస్ఈ- సీడీపీ- పీపీ (ఎంఎస్ఎంఈ) పార్కును 2025, మే 5న ప్రారంభించారు. రహదారులు, ఎలక్ట్రిసిటీ తదితర పనులు పూర్తయ్యాయి. మొత్తం 69 ప్లాట్లుగా విభజించారు. ఇక్కడ ఎకరా ధర రూ.49 లక్షలుగా నిర్ణయించారు.

జగదుర్తిలో 2025, జూన్ 4న ఎంఎస్ఎంఈ పార్కును ప్రారంభించారు. ఇక్కడ ఎకరా ధర సుమారు రూ.40 లక్షలుగా నిర్ణయించారు. ఒక్కో ప్లాటు.. ఎకరం విస్తీర్ణం చొప్పున 35 ప్లాట్లుగా విభజించి ఏపీఐఐసీ వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచారు.

మండలం	గ్రామం	కేటాయించిన భూమి (ఎకరాల్లో)
జూపాడుబంగ్లా	తంగడంచ	50
కొలిమిగుండ్ల	ఇటిక్యాల	59.97
డోన్	జగదుర్తి	36.09
ఆళ్లగడ్డ	ఆర్.కృష్ణాపురం	44
గోస్పాడు	యాళ్లూరు	9
ఆత్మకూరు	కరివేన	2.50

భూముల కేటాయింపు

గోస్పాడు మండలం యాళ్లూరులో ఎంఎస్ఎంఈ పార్కుకు భూమి కేటాయించారు. మౌలిక సదుపాయాల కల్పనకు టెండర్లు పిలిచారు.

ఆత్మకూరు మండలంలోని కరివేనలో ఏర్పాటు చేయనున్న ఎంఎస్ఎంఈ పార్కులో వసతులు కల్పించేందుకు టెండర్లు పిలవాల్సి ఉంది.

ఆర్.కృష్ణాపురంలో ఎంఎస్ఎంఈ పార్కును 2025, నవంబరు 11న శంకుస్థాపన చేశారు. ప్రస్తుతం సదుపాయాల కల్పనకు సంబంధించిన పనులు జరుగుతున్నాయి.

తంగడంచలో 50 ఎకరాలు, కొలిమిగుండ్ల మండలం ఇటిక్యాలలో ఎంఎస్ఎంఈ పార్కు కోసం 59.97 ఎకరాలు కేటాయించారు.

ప్రశాంతంగా నీట్ పీజీ పరీక్ష

పాణ్యం గ్రామీణ, నంద్యాల నేరవిభాగం, నంద్యాల పట్టణం, న్యూస్‌టుడే: జిల్లాలో నీట్ పీజీ పరీక్ష ఆదివారం ప్రశాంతంగా జరిగింది. పట్టణంలోని ఎస్ఆర్ ఇంజినీరింగ్ కళాశాలలో నిర్వహించిన పరీక్షకు 105 మందికిగాను 98 మంది హాజరయ్యారు. రామకృష్ణ పీజీ కళాశాలలో 120 మంది అభ్యర్థులు హాజరు కావాల్సి ఉండగా... 116 మంది పరీక్ష రాశారు. పాణ్యం మండల పరిధిలోని ఆర్జీఎం ఇంజినీరింగ్ కళాశాలలో 295 మంది అభ్యర్థులకుగాను 275, శాంతిరాం ఇంజినీరింగ్ కళాశాలలో 250 మందికి గాను 236 మంది హాజరయ్యారు. పలు పరీక్ష కేంద్రాలను ఎస్పీ సునీల్ షొరాణ్ తనిఖీ చేశారు. పరీక్ష ప్రశాంతంగా.. పారదర్శకంగా నిర్వహించేలా చర్యలు తీసుకున్నట్లు పేర్కొన్నారు. ఆయన వెంట ఏఎస్పీ, డీఎస్పీ శ్రీనివాస రెడ్డి, సీఐ అస్రార్‌బాషా తదితరులు ఉన్నారు.


పరీక్షా కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న ఎస్పీ సునీల్ షొరాణ్

దోపిడీకి సహకారం

- అనధికారికంగా ప్రాసెసింగ్ ఛార్జీల వసూలు

పుల్లిమద్ది గ్రామానికి చెందిన ఓ రైతు ఇటీవల నంద్యాల మండలం పోలూరు సహకార సంఘంలో రూ.2 లక్షల రుణం తీసుకోగా ప్రాసెసింగ్ ఛార్జీల కింద రూ.5 వేలు తీసుకున్నారు. ఇదే గ్రామానికి చెందిన మరో రైతు రూ.3 లక్షల రుణం తీసుకోగా రూ.7,500 వసూలు చేశారు.

ప్రస్తుతం ఖరీఫ్ సీజన్ సాగుతోంది. సహకార సంఘాలకు రైతులు క్యూ కడుతున్నారు. నిబంధనల మేరకు పంట రుణాలకు ప్రాసెసింగ్ ఛార్జీలు లేవు. ఉమ్మడి జిల్లాలోని పలు సహకార సంఘాల్లో రుణాలిచ్చే సమయంలో రైతుల నుంచి కొందరు సిబ్బంది వీటిని వసూలు చేస్తున్నారు. ప్రాసెసింగ్ ఛార్జీల మొత్తం ఇస్తేనే రుణాలు ఇస్తామని, లేకుంటే ఇవ్వమని స్పష్టం చేస్తున్నారు. – న్యూస్‌టుడే, నంద్యాల పట్టణం

ఉమ్మడి కర్నూలు జిల్లా సహకార కేంద్ర బ్యాంకు పరిధిలో కర్నూలు జిల్లాలో 43, నంద్యాల జిల్లాలో 54 సహకార సంఘాలు ఉన్నాయి. ఆయా సంఘాల పరిధిలో రైతులకు ఏటా పంట రుణాలు మంజూరు చేస్తున్నారు. 2026-27 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి వ్యవసాయ రుణాలను ప్రస్తుతం పంపిణీ చేస్తున్నారు. కర్నూలు జిల్లాలో రూ.320 కోట్లు, నంద్యాల జిల్లాలో రూ.370 కోట్ల రుణాలు ఇవ్వాలని లక్ష్యంగా నిర్ణయించుకున్నారు. పంటల సీజను కావడంతో ప్రస్తుతం రైతులు సంఘాల చుట్టూ తిరుగుతున్నారు. ఇదే కొందరికి ఆదాయంగా మారింది. పంట రుణాలకు ఎక్కడా ప్రాసెసింగ్ ఛార్జీలు లేవని చెబుతున్నారు. కానీ కొన్ని సంఘాల్లో రైతుల నుంచి వీటిని వసూలు చేస్తున్నారు.

రుణం ఆధారంగా..

ఇప్పుడు రుణాల ఆధారంగా ప్రాసెసింగ్ ఛార్జీలు 2.5 శాతం నుంచి 3 శాతం వరకు వసూలు చేస్తున్నారు. ప్రస్తుతం ఎకరాకు రూ.లక్ష వరకు రుణం ఇస్తున్నారు. గరిష్ఠంగా రూ.3 లక్షల వరకు పంట రుణాలు మంజూరు చేస్తున్నారు. రూ.లక్షకు రూ.2,500 వరకు వసూలు చేస్తున్నారు. రూ.3 లక్షల రుణానికి కొన్ని సంఘాల్లో 3 శాతం వరకు అంటే రూ.9 వేల వరకు తీసుకుంటున్నారు. కొన్నిచోట్ల అసలు రైతులకు తెలియకుండానే ప్రాసెసింగ్ ఛార్జీ పేరుతో తీసేస్తున్నారు.

మంజూరు సమయంలోనే..

కర్నూలు, నంద్యాల జిల్లాలోని పలు సహకార సంఘాల్లో మార్టిగేజ్ రుణాల మంజూరు సిఫార్సులమయంగా మారింది. రూ.3 లక్షల కుదువ రుణానికి రూ.20 వేల వరకు వసూలు చేస్తున్నారు. రుణం మంజూరు సమయంలోనే ఈ మొత్తాన్ని మినహాయించుకొంటున్నారు. కోడుమూరు, ఎమ్మిగనూరు, ఆదోని, ఆలూరు నియోజకవర్గాల్లో మార్టిగేజ్ రుణాల మంజూరులో ఓ దళారి చెబితే ఒక ధర. చెప్పకుంటే మరో ధరతో వసూలు చేస్తున్నారు. నంద్యాల మండలంలోని ఓ సొసైటీలో పనిచేసే సిబ్బంది ఒకరు పంట రుణం, మార్టిగేజ్ రుణాల్లో కీలకంగా వ్యవహరిస్తున్నారు. పోలూరు, సంతజూటూరు, కానాల సొసైటీల్లో కమీషన్లు ఎందుకని ప్రశ్నించిన కొందరు రైతులను నెల రోజులుగా తిప్పుకొంటున్నారు.

వారి కనుసన్నల్లోనే..

కొన్ని సహకార సంఘాల్లో కొందరు కుమ్మక్కై ప్రాసెసింగ్ ఛార్జీలు వసూలు చేస్తున్నారన్న ఆరోపణలున్నాయి. కర్నూలు జిల్లా డివిజన్ పరిధిలోని నాలుగు సహకార సంఘాల్లో అడిగిన మొత్తం ఇస్తామని ఒప్పుకొన్నాకే రుణం మంజూరు చేస్తున్నారు. రుణాల మంజూరులో సిబ్బంది కంటే ఒక దళారి కీలకంగా వ్యవహరిస్తున్నారు. నంద్యాల జిల్లాలోని గడివేముల, మిడుతూరు, సంతజూటూరు సొసైటీల పరిధిలో రైతులు ఎవరైనా కమీషన్ల విషయమై ప్రశ్నిస్తే ఏదో ఒక వంకతో రుణాలు ఇచ్చేందుకు అభ్యంతరం చెబుతున్నారు.

దివ్యాంగులకు ఆరోగ్య భరోసా

ఆరోగ్య సమస్యలు వచ్చినప్పుడు చాలా కుటుంబాలు వైద్య ఖర్చులకు ఇబ్బందులు పడుతుంటాయి. దివ్యాంగుల విషయంలో ఖర్చులు మరింత ఎక్కువగా ఉంటుంది. ఇలాంటివారికి ఆర్థిక భరోసా కల్పించేందుకు 'నిరామయ ఆరోగ్య బీమా' పథకాన్ని కేంద్రం తీసుకొచ్చింది. పలు వైకల్యాలతో అనారోగ్యానికి గురయ్యేవారు బీమా పొందొచ్చు. అర్హులైనవారికి వైద్య చికిత్స నిమిత్తం ఏడాదికి రూ.లక్ష బీమా కవరేజీ లభిస్తుంది. ఏటా పునరుద్ధరించుకోవాల్సి ఉంటుంది.
– న్యూస్‌టుడే, డోన్ పట్టణం, నంద్యాల విద్య

ఎవరు అర్హులంటే..

ఆటిజం, సెరిబ్రల్ పాల్సీ, మానసిక దివ్యాంగులు, బహుళ వైకల్యాలు ఉన్న దివ్యాంగులు పథకానికి అర్హులు. కేంద్ర సామాజిక న్యాయం, సాధికారత మంత్రిత్వ శాఖ పరిధిలో 'ది నేషనల్ ట్రస్ట్' బీమా పథకాన్ని అమలు చేస్తోంది.


చిన్నారి వివరాలు నమోదు చేస్తున్న సిబ్బంది

దరఖాస్తు విధానం

నిరామయ పోర్టల్‌లో బీమా పథకానికి దరఖాస్తు చేసుకోవాలి. యూడీఐడీ కార్డుతోపాటు రేషన్‌కార్డు, ఆధార్‌కార్డు, ఆదాయ ధ్రువ పత్రం, బ్యాంకు ఖాతాలకు సంబంధించిన నకళ్లు పొందుపరచాలి. మరింత సమాచారం కోసం https://www.myscheme.gov.inలో చూడొచ్చు.

వైద్య ఖర్చులకు ఉపయోగం

కర్నూలు జిల్లాలో 26, నంద్యాల జిల్లాలో 29 భవిత కేంద్రాలు ఉండగా వీటి పరిధిలో 7,500 మంది ప్రత్యేక అవసరాల పిల్లలు ఉన్నారు. వైద్య పరీక్షలు, ఆసుపత్రి ఖర్చులు, ఫిజియోథెరపీ, మందుల కొనుగోలుకు బీమా పథకం చేయూతనిస్తుంది. అర్హత ఉన్న అందరికీ ఒకే రకమైన ప్రీమియం వర్తిస్తుంది.

'దివ్యాంగుల ఆరోగ్య భద్రత కోసం కేంద్రం 'నిరామయ ఆరోగ్య బీమా' పథకాన్ని ప్రవేశపెట్టింది. అర్హులైనవారు దరఖాస్తు చేసుకోవచ్చు. దరఖాస్తు సమయంలో ఏవైనా సమస్యలు తలెత్తితే భవిత కేంద్రాల్లోని ఐఈఆర్టీలను సంప్రదించవచ్చు' అని సహిత జిల్లా సమన్వయకర్త (నంద్యాల) జగన్మోహన్‌రెడ్డి తెలిపారు.

అన్నివర్గాల సంక్షేమానికి ప్రాధాన్యం

జూలేపల్లె, యాళ్లూరు (గోస్పాడు), న్యూస్‌టుడే : అన్నివర్గాల సంక్షేమమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం పనిచేస్తోందని మంత్రి ఎన్ఎండీ ఫరూక్ అన్నారు. మండలంలోని జూలేపల్లెలో విలేజ్ హెల్త్ క్లినిక్ నిర్మాణానికి ఆయన ఆదివారం భూమి పూజ చేశారు. అనంతరం యాళ్లూరులో తెదేపా నేత కైప శివరామిరెడ్డి ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరాన్ని ప్రారంభించి ఆరోగ్య పరీక్షలు చేయించుకున్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన సమావేశంలో మంత్రి మాట్లాడుతూ గ్రామాల్లో ఎప్పటికప్పుడు సమస్యలు పరిష్కరిస్తున్నామని.. పెద్దఎత్తున అభివృద్ధి పనులు చేస్తున్నామని వివరించారు. ఎల్‌నినో నేపథ్యంలో వర్షాలు లేక పంటలకు సాగు నీరు అందడం కష్టమైందని, ఆరుతడి పంటలు మాత్రమే వేసుకోవాలని రైతులను మంత్రి కోరారు. ఈ కార్యక్రమంలో విశ్రాంత డీఎంహెచ్‌వో కైప శివశంకర్‌రెడ్డి, శివరామిరెడ్డి, తిమ్మారెడ్డి, రోటరీక్లబ్ మాజీ అధ్యక్షుడు శ్రీరామమూర్తి, అరవిందప్రసాద్ పాల్గొన్నారు.


మాట్లాడుతున్న మంత్రి ఎన్ఎండీ ఫరూక్

శ్రీమఠంలో వైభవంగా మధ్యారాధన

మంత్రాలయం, మంత్రాలయం గ్రామీణం, న్యూస్‌టుడే: సుప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన మంత్రాలయం శ్రీరాఘవేంద్ర స్వామి ఆరాధనోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా ఆదివారం స్వామివారి మధ్యారాధన నిర్వహించారు. ఉదయాన్నే 4 గంటలకు పీఠాధిపతి సుబుదేంద్రతీర్థులు నిర్మల్య విసర్జన, ఉత్సవ రాయల పాద పూజ, పంచామృతాభిషేకాలు నిర్వహించారు. స్వామివారి మూల బృందావనాన్ని స్వర్ణ కవచాలతో అలంకరించారు. అంతకు ముందు గ్రామదేవత మంచాలమ్మను విశేషంగా అలంకరించి ప్రత్యేక పూజలు జరిపారు.


మూల బృందావనానికి హారతి ఇస్తున్న పీఠాధిపతి


స్వర్ణ రథంపై ఊరేగుతున్న రాఘవేంద్రస్వామి

- ఉదయం 11 గంటల నుంచి మూల రఘుపతి వేదవ్యాసుల పూజ, అలంకరణ సమర్పణ, మహా మంగళహారతి తదితర పూజలు నిర్వహించారు. అనంతరం శ్రీమఠం ప్రాకారంలో స్వర్ణ రథంపై రాఘవేంద్రస్వామి బంగారు ప్రతిమను ఊరేగించారు. సాయంత్రం 6.30 గంటలకు పరిమళతీర్థ పుష్కరిణిలో తెప్పోత్సవం జరిపారు. భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి స్వామివారిని దర్శించుకున్నారు.

ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయం

బనగానపల్లి, న్యూస్‌టుడే: ప్రజా సమస్యల పరిష్కారమే తమ ధ్యేయమని రహదారులు, భవనాల శాఖ మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి పేర్కొన్నారు. క్యాంపు కార్యాలయంలో మంత్రి బీసీ ఆదివారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజల నుంచి మంత్రి అర్జీలను స్వీకరించి వివరాలు తెలుసుకున్నారు. కొన్నింటికి అక్కడినుంచే సంబంధిత అధికారులకు ఫోన్‌లో సమస్యను వివరించి త్వరగా పరిష్కరించాలని ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి బీసీ మాట్లాడుతూ బాధితుల సమస్యలు న్యాయపరంగా సరైనవి అయితే త్వరగా పరిష్కారమవుతాయని పేర్కొన్నారు. కొన్నింటిని అధికారులు క్షేత్రస్థాయికి వెళ్లి పరిశీలించి న్యాయం చేస్తారన్నారు. ఇచ్చిన ప్రతి అర్జీని పరిష్కరించేలా చర్యలు తీసుకుంటామన్నారు.


వినతిపత్రం పరిశీలిస్తున్న మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి



కాలువ శిథిలం.. సాగు భారం

ఎస్సార్బీసీ 16వ బ్లాక్ పరిధిలో తుడుమలదిన్నె, అల్లూరు గ్రామాల వరకు ఉన్న పంట కాలువ దెబ్బతింది. లైనింగ్ శిథిలావస్థకు చేరుకుంది. ఈ నేపథ్యంలో కాలువ కోతకు గురికాకుండా ఉండేందుకు సిమెంటు దిమ్మెలు అడ్డుగా ఉంచారు. కాలువ రూపు కోల్పోవడంతో చివరి ఆయకట్టుకు నీరందని పరిస్థితి ఏర్పడింది. అధికారులు స్పందించి తగిన చర్యలు చేపట్టాలని రైతులు విన్నవిస్తున్నారు. – న్యూస్‌టుడే, ఉయ్యాలవాడ

కర్నూలులో హైకోర్టు బెంచ్ ఏర్పాటు చేస్తాం 6లో

ఆగని ప్రమాదాలు

- మృత్యుకూపాలుగా నీటి కుంటలు

నీటి కుంటలు మృత్యుకూపాలుగా మారుతున్నాయి. చెరువులు, కుంటల్లో అక్రమంగా మట్టి తవ్వకాలు చేపట్టడంతో భారీ గుంతలు ఏర్పడుతున్నాయి. మరోవైపు నాపరాయి కోసం తవ్విన గుంతలతో నిత్యం ప్రమాదాలు జరుగుతున్నాయి. దీంతో పలువురు ప్రాణాలు సైతం కోల్పోతున్నారు. బనగానపల్లి నియోజకవర్గ పరిధిలో రైల్వే పనులకు సంబంధించి మట్టి కోసం తవ్వకాలు చేశారు. కొలిమిగుండ్ల, అవుకు, బనగానపల్లిలో నాపరాయి గుంతలు, పరిశ్రమల వద్ద నీటి గుంతలున్నాయి. నియోజకవర్గంలో దాదాపు 500 దాకా గని గుంతలు ఉన్నట్లు అంచనా.
– న్యూస్‌టుడే, కోవెలకుంట్ల పట్టణం


పలుకూరులో నీటితో నిండిపోయిన నాపరాయి గని ప్రాంతం

పర్యవేక్షణ కానరాక..

గనుల్లో ముడి సరకు కోసం తీసిన గుంతలు 10 నుంచి 50 అడుగుల లోతు ఉంటాయి. చాలా ప్రాంతాల్లో ఇవి నీటితో నిండిపోయాయి. వీటి లోతు తెలియక పలువురు ప్రమాదాలబారిన పడుతున్నారు. విద్యాలయాలకు సెలవుల సమయంలో విద్యార్థులు తోటి మిత్రులతో కలిసి సరదాగా గడిపేందుకు బయటకు వెళ్తుంటారు. వారిపై తల్లిదండ్రుల పర్యవేక్షణ లేకపోవడంతో నీటి కుంటల వైపు వెళ్లి ప్రాణాలు కోల్పోతున్నారు. మరోవైపు ఆయా కుంటల వద్ద హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాల్సి ఉన్నా అధికారులు దృష్టి సారించడం లేదు.

కొన్ని ఘటనలు ఇలా..

- ఐదేళ్ల కిందట బనగానపల్లి పట్టణ శివారులోని ఇద్దరు విద్యార్థులు ఓ నాపరాయి పరిశ్రమలో ఉన్న నీటి కుంటలో ఈత కొట్టేందుకు వెళ్లి లోతు తెలియక మునిగి ప్రాణాలు వదిలారు.
- రెండేళ్ల కిందట పలుకూరు గ్రామ శివారులో స్నానానికి వెళ్లిన ఇద్దరు వ్యక్తులు ప్రమాదవశాత్తు గని గుంతలో పడి చనిపోయారు.
- అమడాల గ్రామానికి చెందిన ఓ వ్యక్తి కోవెలకుంట్ల శివారులోని ఓ గని గుంతలో గతేడాది ప్రమాదవశాత్తు పడిపోయి మృతి చెందారు.
- గతేడాది ఆగస్టులో కొలిమిగుండ్ల గ్రామ శివారులో ఈత కొట్టేందుకు వెళ్లి కుంటలో పడి చాంద్ బాషా అనే యువకుడు ప్రాణాలు కోల్పోయారు.

ధర్నాను విజయవంతం చేయండి

నంద్యాల పట్టణం, న్యూస్‌టుడే: ఇన్ సర్వీస్ ఉపాధ్యాయులకు టెట్ రద్దు చేయాలని కోరుతూ సెప్టెంబరు 2వ తేదీ నుంచి 11 వరకు నిర్వహించే ధర్నాను విజయవంతం చేయాలని ఏపీటీఎఫ్ నాయకులు కోరారు. స్థానిక సంఘం జిల్లా కార్యాలయంలో ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు ఎం.రామచంద్రారెడ్డి అధ్యక్షతన ముఖ్య కార్యకర్తల సమావేశం ఆదివారం జరిగింది. ఆయన మాట్లాడుతూ మంగళగిరిలోని విద్యా భవన్ ఎదుట జరిగే ధర్నా కార్యక్రమంలో ఉపాధ్యాయులంతా పాల్గొనాలని కోరారు. ధర్నాకు సంబంధించిన గోడపత్రాలను ఆవిష్కరించారు.


కరపత్రాలు విడుదల చేస్తున్న ఏపీటీఎఫ్ నాయకులు

ఈ సమావేశంలో ఫెడరేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి శివయ్య, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు జాకీర్ హుస్సేన్, భాస్కర్‌రెడ్డి, హరినాథ్‌గౌడ్, పుల్లయ్య, చంద్రహాసరెడ్డి, నూరుల్లా, సుబ్బారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నేడు ప్రజా సమస్యల పరిష్కార వేదిక

నంద్యాల పట్టణం, న్యూస్‌టుడే : నంద్యాలలో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ జి.రాజకుమారి తెలిపారు. కలెక్టరేట్‌లోని పీజీఆర్ఎస్ హాలులో నిర్వహించే ఈ కార్యక్రమంలో ప్రజల నుంచి వినతులు స్వీకరించనున్నట్లు ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కలెక్టరేట్‌తోపాటు అన్ని డివిజన్ కార్యాలయాలు, తహసీల్దారు, మున్సిపల్, ఎంపీడీవో కార్యాలయాల్లోనూ పీజీఆర్ఎస్ జరుగుతుందన్నారు.

పట్టు జారుతోంది

- కాలుష్యంతో సాగు కనుమరుగు

మండల పరిధిలోని సూదేపల్లి రైతులు పట్టుగూళ్ల పెంపకం, మల్బరీ సాగులో అధిక దిగుబడులు సాధించి జాతీయ స్థాయిలో అవార్డులు అందుకున్నారు. ఒకప్పుడు గ్రామంలోకి వెళ్తుంటే రహదారికి ఇరువైపులా మల్బరీ సాగుతో వాతావరణం ఆహ్లాదకరంగా ఉండేది. ప్రస్తుతం కాలుష్యం కారణంగా పట్టుగూళ్ల పెంపకం చేపట్టే పరిస్థితి లేకుండా పోయింది. సమస్యను అధికారులకు విన్నవించినా ప్రయోజనం శూన్యమే.
– న్యూస్‌టుడే, వెల్దుర్తి

చర్యలు శూన్యమే

కాలుష్యం కారణంగా మల్బరీ సాగు దెబ్బతింటోందని రైతులు కర్నూలు, నంద్యాల జిల్లా కలెక్టర్లకు ఫిర్యాదు చేశారు. గుంటూరులోని పట్టుపరిశ్రమ శాఖ కార్యాలయంలో అడిషనల్ డైరెక్టర్‌కు విన్నవించినా ప్రయోజనం లేకపోయిందని అన్నదాతలు వాపోతున్నారు.

'గతంలో 6 ఎకరాల్లో మల్బరీ సాగు చేపట్టా. ప్రస్తుతం ఎకరాలో మాత్రమే మల్బరీ సాగు చేస్తున్నా' అని ఉత్తమ రైతు అవార్డు గ్రహీత శివశంకర్‌గౌడ్ చెప్పారు.


నిరుపయోగంగా ఉన్న పట్టుగూళ్ల పెంపకం షెడ్డు వద్ద రైతు వెంకటేశ్

అంతరించిన పెంపకం

రసాయన పరిశ్రమ నుంచి వచ్చే కాలుష్యం కారణంగా సూదేపల్లి గ్రామంలో ప్రస్తుతం పట్టుగూళ్ల ఉత్పత్తులు అంతరించిపోయాయి. గ్రామంలో మల్బరీ సాగు చేపట్టిన దాదాపు 120 మంది రైతులు ప్రతి నెలా 100 నుంచి 120 కిలోల మేర పట్టుగూళ్లను ఉత్పత్తి చేసి హిందూపురం, ధర్మవరం ప్రాంతాల్లో విక్రయించేవారు. ఏడాదికి ఈ ఒక్క గ్రామం నుంచే దాదాపు 1,200 నుంచి 1,300 కిలోల పట్టుగూళ్లు ఉత్పత్తి చేసేవారు. ప్రస్తుతం కాలుష్యం కారణంగా ఉత్పత్తి ఆగిపోయింది.

కంది పంట వేశా : వెంకటేశ్

నాకు రెండు ఎకరాల భూమి ఉండటంతో మల్బరీ సాగు చేపట్టా. పట్టుగూళ్ల విక్రయంతో ప్రతినెలా రూ.50 వేల లెక్కన.. సగటున ఏడాదికి రూ.4 లక్షల నుంచి రూ.5 లక్షల మేర ఆదాయం వచ్చేది. కాలుష్యం కారణంగా పట్టు పురుగులు చనిపోతున్నాయి. నష్టాలు రావడంతో ప్రస్తుతం కంది సాగు చేపట్టా.

360 నుంచి 3 ఎకరాలకు..

సూదేపల్లి గ్రామంలో 2010లో మల్బరీ సాగు, పట్టుగూళ్ల పెంపకం ప్రారంభమైంది. ఏటా సాగు చేసే రైతుల సంఖ్య పెరుగుతూ వచ్చింది. సుమారు 120 మంది 360 ఎకరాల్లో సాగు చేపడుతూ వచ్చారు. ప్రతి రైతు 2-3 ఎకరాల మేర మల్బరీ సాగు చేయగా ఏడాదికి సగటున ఒక్కొక్కరికి రూ.5 లక్షల ఆదాయం వచ్చేది. నంద్యాల జిల్లా ఉడుములపాడు సమీపంలో ఏర్పాటుచేసిన పరిశ్రమ నుంచి వచ్చే కాలుష్యం కారణంగా పట్టు పురుగులు పూర్తిగా నశించసాగాయి. కాలుష్యం నేపథ్యంలో 2020 నుంచి నష్టాలు రావడం ప్రారంభమైంది. ఫలితంగా 2026 నాటికి పట్టుగూళ్లు, మల్బరీ సాగు కేవలం 3 ఎకరాలకు చేరింది. ఏడాదిలో 10 నుంచి 11 సార్లు వచ్చే పంట.. కాలుష్యం కారణంగా ఒక్కసారి మాత్రమే వస్తోందని రైతులు ఆవేదన చెందుతున్నారు.

కళా వైభవం



శ్రీశైల మహాక్షేత్రంలో దేవస్థానం నిర్వహిస్తున్న నిత్య కళారాధనలో భాగంగా ఆదివారం జరిగిన సంప్రదాయ నృత్య ప్రదర్శన భక్తులను ఆకట్టుకుంది. హైదరాబాద్‌కు చెందిన శ్రీనటేశ్వరి ఫౌండేషన్ ఆఫ్ ఆర్ట్స్ అండ్ కల్చరల్ బృంద సభ్యులు పలు ఆధ్యాత్మిక గీతాలకు సంప్రదాయ నృత్యాలు చేశారు. కళాకారులను దేవస్థానం అధికారులు సత్కరించారు.
– న్యూస్‌టుడే, సున్నిపెంట సర్కిల్, శ్రీశైలం

పంట కాలువకు నీటి విడుదల

పాణ్యం గ్రామీణం, న్యూస్‌టుడే: గోరుకల్లు జలాశయం నుంచి ఎస్సార్బీసీ పంట కాలువకు నీటిని విడుదల చేసినట్లు అధికారులు తెలిపారు. సుమారు వెయ్యి క్యూసెక్కుల నీటి ప్రవాహం వదిలినట్లు చెప్పారు. కాలువకు నీటి విడుదల నేపథ్యంలో ఎక్కడా ఇబ్బందులు లేకుండా తగిన చర్యలు చేపట్టినట్లు పేర్కొన్నారు.

తేళ్లతో పూజ.. కొండంత అండ

◆ కొండ్రాయుడికి నేడు వృశ్చికాభిషేకం

కోడుమూరు గ్రామీణ, న్యూస్‌టుడే: భక్తితో ఏది సమర్పించినా దేవుడు స్వీకరిస్తాడంటారు. సాధారణంగా దేవుళ్లకు భక్తులు పట్టువస్త్రాలు, ఫలం, పత్రం, నైవేద్యంతో పూజలు చేసి డబ్బు, బంగారం, వెండి లాంటి వాటిని కానుకల రూపంలో సమర్పిస్తుంటారు. స్వామికి క్షీరాభిషేకాలు, అలంకరణకు పూలమాలలు, ఆభరణాలు వేస్తుంటారు. అందుకు భిన్నంగా తేళ్లను పట్టుకుని స్వామికి సమర్పించటం వింత ఆచారం కొనసాగుతోంది. అదే కోడుమూరు కొండపై వెలసిన వెంకటేశ్వరస్వామి ఆలయం.


ఆలయంలో కొలువుదీరిన స్వామి వారు

రాయి తీస్తే తేళ్ల దర్శనం

కోడుమూరులో వెలసియున్న వెంకటేశ్వర స్వామి కొండ్రాయి కొండపై వెలసిన దైవంగా విరాజిల్లుతున్నాడు. ఏటా శ్రావణ మాసం మూడో సోమవారం భక్తులు కాలినడకన కొండకు చేరుకుని స్వామిని పెద్ద సంఖ్యలో దర్శించుకుంటారు. భక్తులు కొండ్రాయి కొండపైకి చేరుకుని చిన్న చిన్న రాళ్లను కదిపితే తేళ్లు దర్శనమివ్వటం ఇక్కడ ప్రత్యేకత. ఏ మాత్రం భయపడకుండా భక్తితో రాళ్ల కింద ఉండే తేళ్లను పట్టుకుంటారు. వాటిని దారంతో కట్టి కొందరు, మరికొందరు చేతితో పట్టుకుని స్వామి మూలవిరాట్‌పై వదిలి మొక్కులు సమర్పించుకుంటారు. అలా చేస్తే తమ కోరికలు నెరవేరుతాయని వారి విశ్వాసం. దాంతో తరాలుగా భక్తులు ఆ వింత ఆచారాన్ని పాటిస్తున్నారు. స్వామికి తేలుతో పూజలు చేస్తుండటంతో కొండిరాయుడుగా, కొండ్రాయి కొండపై కొలువుదీరటంతో కొండలరాయుడుగా పేరుగాంచాడు.

హాని చేయకపోవటం వింతే

ఈ నెల 31న నిర్వహించే తేళ్లోత్సవానికి భక్తులు సర్వం సిద్ధం చేశారు. కోడుమూరుతో పాటు పలు ప్రాంతాల నుంచి భక్తులు తరలి వచ్చి స్వామిని దర్శించుకుంటారు. కొండపై ఉన్న రాళ్లను కదిపితే భక్తులకు తేళ్లు దర్శనం ఇస్తాయి. ఎన్నో దశాబ్దాలుగా రాళ్ల కింద ఉన్న తేళ్లను తీసుకెళ్లి స్వామికి వేసి పూజిస్తున్నారు. ఆ తేళ్లు ఎలాంటి హాని తలపెట్టవని.. అది స్వామి మహిమ అని చెప్పుకొంటారు. తేళ్లను మాలగా చేసి స్వామికి సమర్పిస్తే కోరికలు నెరవేరుతాయని భక్తుల విశ్వాసం. కొందరు భక్తులు ఒళ్లు గగ్గుర్పొడిచేలా నుదురు, చేతులపై, నోటి పై పెట్టుకుని తమ భక్తిని చాటుతుంటారు. స్వామి నామంతో ఆలయ చుట్టూ తిరిగితే తమకు ఏమీ కాదని అంటుంటారు.

ఒట్టిపోయిన వక్కిలేరు.. నీటికి ఇక్కట్లు



ఆళ్లగడ్డ నియోజకవర్గంలో నాలుగు కీలకమైన మండలాల గుండా ప్రవహించే వకుళా నది(వక్కిలేరు) ప్రస్తుతం ఎండిపోయింది. కరవు ఛాయలను ప్రతిబింబించేలా నది కన్పిస్తోంది. గత మూడేళ్లు ఎండని నది ఈ ఏడాది నీటి ప్రవాహం లేక ఒట్టిపోయింది. వర్షాలు పడినా పడకపోయినా కేసీ, తెలుగు గంగ కాల్వ నీటి ప్రవాహంతో నదిలో నీరు ఉండేది. ఈ ఏడాది ప్రధాన కాల్వల్లో నీటి ప్రవాహం లేకపోవడంతో నది కూడా ఎండిపోయింది. ప్రజలకు, రైతులకు, పశువులకు ఉపయోగపడే నది ఎండిపోవడం ఆందోళన కల్గించే అంశంగా మారింది. – న్యూస్‌టుడే, ఆళ్లగడ్డ

ప్రమాదంతో ముడిపడిన ప్రయాణం

ఆదోని పట్టణంలోని ఆలూరు మార్గంలో ఉన్న జాతీయ రహదారిపై ఆదివారం కొందరు వాహన చోదకులు ప్రమాదకరంగా ప్రయాణాలు చేస్తున్నారు. ఓ వ్యక్తి బైక్‌పై తనతో పాటు మరో నలుగురిని కూర్చోబెట్టుకుని ప్రయాణించారు. ఇది చాలదన్నట్లు తన వాహనానికి మరమ్మతులకు గురైన మరో బైక్‌ను తువ్వాలుతో కట్టుకుని ప్రమాదకరంగా లాక్కెళ్లడం పట్ల పలువురు ఆందోళన వ్యక్తం చేశారు. వేగంగా వెళ్లే క్రమంలో ఏమాత్రం అదుపుతప్పినా ఆరుగురి ప్రాణాలు ప్రమాదంలో పడే ఆస్కారముంది. ఇలాంటి ప్రయాణాలకు ప్రజలు దూరంగా ఉండాలని రవాణా శాఖ, పోలీసు అధికారులు సూచిస్తున్నారు.

– న్యూస్‌టుడే, ఆదోని నేరవార్తలు, పట్టణం



కర్నూలులో హైకోర్టు బెంచ్ ఏర్పాటు చేస్తాం

నంద్యాల పట్టణం, న్యూస్‌టుడే: కర్నూలులో హైకోర్టు బెంచ్ తప్పనిసరిగా ఏర్పాటు చేస్తామని మంత్రి ఎన్ఎండీ ఫరూక్ హామీ ఇచ్చారు. ఈ విషయంలో రాజీ పడే ప్రసక్తే లేదని.. శాశ్వత బెంచ్ ఏర్పాటు చేస్తున్నట్లు ఆయన స్పష్టం చేశారు. రాయలసీయ న్యాయవాదుల ఐకాస వర్కింగ్ ప్రెసిడెంట్ బి. చంద్రుడు ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక మంత్రి కార్యాలయంలో సంఘం నాయకులు కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. కర్నూలులో హైకోర్టు బెంచ్ ఏర్పాటు చేయడంపై వచ్చే నెల 2న నిర్వహించే క్యాబినెట్ సమావేశంలో సీఎం చంద్రబాబు అధికార ప్రకటన చేస్తారని చెప్పారు. ఈ విషయంలో ద్వంద్వ ఆలోచనలకు తావు లేదన్నారు. కార్యక్రమంలో కర్నూలు జిల్లా న్యాయవాద సంఘం సభ్యులు ప్రభాకర్, ఐఏఎల్ నాయకులు రవికాంత్, సుమా రాణి, అనంతపురం జేఏసీ గౌరవాధ్యక్షులు పద్మజ పాల్గొన్నారు.


మంత్రి ఫరూక్‌కు వినతిపత్రం ఇస్తున్న ఐకాస సభ్యులు

ఉద్యోగుల సమస్యలపై నిర్లక్ష్య వైఖరి తగదు

నంద్యాల పాతపట్టణం, న్యూస్‌టుడే: ఉద్యోగ, ఉపాధ్యాయుల న్యాయమైన హక్కులు నెరవేర్చడం, సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం నిర్లక్ష్య ధోరణి అవలంబిస్తోందని ఎస్టీటీఎఫ్ రాష్ట్ర నాయకుడు గోర్ల సుధాకర్ ఆందోళన వ్యక్తం చేశారు. ఆదివారం స్థానిక కార్యాలయంలో ఆయన ఉపాధ్యాయులతో సమావేశమై మాట్లాడారు. ప్రభుత్వ లక్ష్యాలను నెరవేర్చేందుకు ఉద్యోగ, ఉపాధ్యాయులు శక్తి వంచన లేకుండా కృషి చేస్తున్నారన్నారు. జిల్లాల పునర్విభజన నేపథ్యంలో ఇతర అన్ని ప్రభుత్వ శాఖల్లోనూ పదోన్నతులు కల్పిస్తుండగా విద్యాశాఖలో మాత్రం అలాంటి ప్రక్రియ చేపట్టకుండానే కేవలం ఉపాధ్యాయుల సర్దుబాటుతో ముగించారన్నారు. తక్షణమే 30 శాతం ఐఆర్ మంజూరు చేయాలని, 45 ఏళ్లు దాటిన ఉపాధ్యాయులకు ఈహెచ్ఎస్ ద్వారా సంపూర్ణ ఆరోగ్య పరీక్షలకు అనుమతి ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎస్టీటీఎఫ్ రాష్ట్ర నాయకుడు గోర్ల సుధాకర్

పిల్లలకు భయం లేదు పెద్దలకు బాధ్యత

◆ మైనర్లకు ద్విచక్ర వాహనాలు ఇస్తున్న తల్లిదండ్రులు
◆ అధిక వేగంతో తరచూ ప్రమాదాలు

కర్నూలు నేరవిభాగం, న్యూస్‌టుడే : జిల్లాలో ద్విచక్ర వాహనాలు నడిపే మైనర్ల సంఖ్య రోజురోజుకు పెరిగిపోతోంది. దుకాణాలకు వెళ్లి సరకులు తెచ్చేందుకు.. పాఠశాలలు, కళాశాలలకు వెళ్లేందుకు తల్లిదండ్రులు స్వయంగా పిల్లలకు బైకులు, స్కూటర్లు ఇస్తున్నారు. మరికొందరు బాలల ఏకంగా బుల్లెట్, రాయల్ ఎన్‌ఫీల్డ్ వంటి భారీ ద్విచక్ర వాహనాలను నడుపుతూ ప్రధాన రహదారులపై దూసుకెళ్తున్నారు. అధిక వేగంతో ప్రయాణిస్తూ.. వాహనాలను అదుపు చేయలేక ప్రమాదాల బారినపడుతున్నారు. రాంగ్‌రూట్లలో వెళ్తూ ఇతర వాహనదారులను ఇబ్బందులకు గురిచేస్తున్నారు. మైనర్ల డ్రైవింగ్ కారణంగా తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. ఇప్పటికే పలువురు బాలలు మృతి చెందారు. వారి కారణంగా మరికొందరు వాహనదారులు ప్రాణాలు కోల్పోయారు. అయినాసరే చాలామంది మైనర్లు, వారి తల్లిదండ్రులు లెక్కచేయడం లేదు. ట్రాఫిక్ పోలీసులు జరిమానాలు విధిస్తూ.. మంత్రణం చేస్తున్నా మార్పు రాకపోవడం ఆందోళన కలిగిస్తోంది.


కర్నూలు కోల్స్ కళాశాల ముందు ప్రధాన రహదారిపై స్కూటర్‌పై ప్రయాణిస్తున్న ఐదుగురు బాలలు

శిక్షలు ఇలా..

మోటారు వాహన చట్టం సెక్షన్ 199(ఏ) ప్రకారం 18 ఏళ్లలోపు వారు వాహనాలు నడపటం నేరం. మైనర్లు వాహనం నడుపుతూ పోలీసులకు పట్టుబడితే జరిమానాతో పాటు మూడేళ్ల జైలుశిక్ష విధిస్తారు. వాహన రిజిస్ట్రేషన్‌ను ఏడాదిపాటు సస్పెండ్ చేస్తారు. 25 ఏళ్ల వరకు డ్రైవింగ్ లైసెన్స్ పొందేందుకు అర్హత ఉండదు. వాహనం రోడ్డు ప్రమాదానికి గురైతే బీమా వర్తించదు. మైనర్లకు వాహనాలు ఇచ్చిన యజమానులు కూడా జైలుకు వెళ్లాల్సి ఉంటుంది.

ప్రాణాలుపోతున్నా లెక్కేలేదు

జిల్లాలో మైనర్లు ట్రాఫిక్ నియమాలు, మోటారు వాహన చట్టాన్ని యథేచ్ఛగా ఉల్లంఘిస్తున్నారు. నేరమని తెలిసీ ప్రధాన రహదారులపై వాహనాలు నడుపుతున్నారు. శిరస్త్రాణం ధరించడం లేదు. ఒకే వాహనంపై నలుగురు, ఐదుగురు కూర్చుని అతివేగంతో దూసుకెళ్తున్నారు. వీరివల్ల తరచూ ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి.

➤ గతంలో కర్నూలులో ముగ్గురు మైనర్లు ద్విచక్ర వాహనంపై వెళ్తూ రోడ్డు ప్రమాదానికి గురయ్యారు. వారిలో ఓ బాలుడు ప్రాణాలు కోల్పోయాడు.

➤ నగరానికి చెందిన ఓ వైద్యుడి కుమారుడు జాతీయ రహదారిపై బుల్లెట్ వాహనాన్ని అతివేగంతో నడుపుతూ అదుపుతప్పి పడిపోయి ప్రాణాలు కోల్పోయాడు.

➤ ఓ మైనర్ వాహనాన్ని డ్రైవింగ్ చేస్తూ మరో ద్విచక్ర వాహనంపై వెళ్తున్న వ్యక్తికి ఢీకొట్టడంతో అతను ప్రాణాలు కోల్పోయారు. దీంతో ఆయన కుటుంబం ఆధారం కోల్పోయింది. ఇలాంటి ఘటనల పలువురు తల్లిదండ్రులకు కడుపుకోత మిగిల్చుతున్నాయి.

మొక్కుబడి చర్యలతో మారని పరిస్థితి

మైనర్ల డ్రైవింగ్ విషయంలో పోలీసు అధికారులు కూడా చట్టాన్ని పటిష్ఠంగా అమలు చేయడం లేదు. దీంతో వారు పోలీసుల చర్యలను తేలిగ్గా తీసుకుంటున్నారు. పోలీసులు అప్పుడప్పుడు స్పెషల్‌డ్రైవ్ నిర్వహించి వాహనాలు నడుపుతూ పట్టుబడిన పిల్లలతో పాటు వారి తల్లిదండ్రులకు మంత్రణం చేసి వదిలేస్తున్నారు. దీంతో వారు పద్ధతి మార్చుకోవడం లేదు. తనిఖీలు నిర్వహించిన ప్రతిసారి పదుల సంఖ్యలో మైనర్లు పట్టుబడుతుండటం గమనార్హం. ఈనెల 20వ తేదీన కర్నూలు నగరంలో నిర్వహించిన స్పెషల్ డ్రైవ్‌లో 20 మంది బాలలు వాహనాలు నడుపుతూ దొరికారు. ఈ ఏడాది జనవరి నుంచి జూన్ వరకు మైనర్ల డ్రైవింగ్‌పై జిల్లా వ్యాప్తంగా 56 కేసులు మాత్రమే నమోదు చేయడం గమనార్హం.

సాహిత్యంలో జిల్లాకు గుర్తింపు తీసుకురావాలి

కర్నూలు నగరం, న్యూస్‌టుడే : తెలుగు సాహిత్యంలో కర్నూలు జిల్లాకు రాష్ట్రస్థాయిలో గుర్తింపు తీసుకురావాలని మాజీ ఎంపీ టీజీ వెంకటేష్ కవులు, రచయితలను కోరారు. గిడుగు రామ్మూర్తి జయంతిని పురస్కరించుకుని నగరంలోని టీజీవీ కళాక్షేత్రంలో ఆదివారం శతాధిక కవి సమ్మేళనం జరిగింది. ఉమ్మడి కర్నూలు జిల్లా నుంచి 105 మంది కవులు, కవయిత్రులు పాల్గొని తమ కవితలను చదివి వినిపించారు. డీఈవో సుధాకర్ మాట్లాడుతూ కళాక్షేత్రాన్ని నాటక ప్రదర్శనలకే పరిమితం చేయకుండా తెలుగు సాహిత్య కార్యక్రమాలు నిర్వహిస్తూ కవులు, రచయితలను ప్రోత్సహించడం అభినందనీయమన్నారు. ఈసందర్భంగా డీఈవో సినీ గేయాలు ఆలపించారు. టీజీ వెంకటేష్, డీఈవో, పత్తి ఓబులయ్య తదితరులు కవులను సత్కరించారు.


కవులను సత్కరించిన మాజీ ఎంపీ టీజీ వెంకటేష్, ఓబులయ్య



వేడుకగా పల్లకి సేవ

శ్రీశైలం ఆలయం, న్యూస్‌టుడే : శ్రీశైల మహాక్షేత్రంలో ఆదివారం శ్రీభ్రమరాంబ మల్లికార్జున స్వామివార్లకు పల్లకీ సేవ జరిగింది. సాయంత్రం ఆలయ ప్రాంగణంలో ఆశీర్వచన మండపంలో శ్రీస్వామిఅమ్మవార్ల ఉత్సవమూర్తులను పల్లకిలో కొలువుదీర్చి, దేవస్థానం అర్చకులు షోడశోపచార పూజలు చేసి మంగళహారతులు సమర్పించారు. సిబ్బంది, భక్తులు పల్లకిలో కొలువైన ఉత్సవమూర్తులకు భ్రమరాంబాదేవి ఆలయం చుట్టూ ప్రదక్షిణ నిర్వహించారు.

కార్యకర్తల సంక్షేమానికి ప్రాధాన్యం

బనగానపల్లి, న్యూస్‌టుడే: కార్యకర్తలకు తెదేపా ఎప్పుడూ అండగా ఉంటుందని ఆర్అండ్‌బీ శాఖ మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి పేర్కొన్నారు. కొలిమిగుండ్ల మండలం నాగిశెట్టిపల్లె గ్రామానికి చెందిన తెదేపా కార్యకర్త మాధవరాయుడు ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందారు. ఈ నేపథ్యంలో ఆదివారం మృతుడి భార్య కృష్ణకుమారికి రూ.5లక్షల చెక్కును మంత్రి బీసీ అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి బీసీ మాట్లాడుతూ.. పార్టీ సభ్యత్వం తీసుకున్నందున కార్యకర్తకు బీమా కింద నగదు వచ్చినట్లు తెలిపారు. కార్యకర్తల సంక్షేమానికి తెదేపా బీమా పథకం ప్రవేశపెట్టినట్లు తెలిపారు. పార్టీ కోసం పనిచేసే ప్రతి కార్యకర్తకు భరోసా ఇవ్వాలని బీమా పథకం తీసుకొచ్చారని అన్నారు. దేశంలో ఏ పార్టీకి లేని బీమా సదుపాయం తెదేపాకు ఉందన్నారు. పార్టీ కోసం పని చేసే కార్యకర్తల కోసం తాను అన్ని విధాలా అండగా ఉంటామన్నారు. కష్టకాలంలో కుటుంబానికి ఆర్థిక ఇబ్బందులు లేకుండా కొంతైనా మేలు జరుగుతుందన్నారు.


బాధిత కుటుంబ సభ్యులకు చెక్కును అందజేస్తున్న మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి

పేదలకు ఉచిత వైద్య సేవలే లక్ష్యం

సంజామల, న్యూస్‌టుడే: గ్రామీణ ప్రాంత పేద ప్రజలకు ఉత్తమ వైద్య సేవ లందించడమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నామని పెద్దిరెడ్డి తిమ్మారెడ్డి ఛారిటబుల్ మెమోరియల్ ట్రస్ట్ డైరెక్టర్ పెద్దిరెడ్డి షేక్షావలిరెడ్డి పేర్కొన్నారు. మండలంలోని మంగపల్లెలో ఆదివారం ట్రస్ట్ ఆధ్వర్యంలో మెగా ఉచిత వైద్యశిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. తన సొంత నిధులు వెచ్చించి ప్రతి నెలా పేద రోగులకు కార్పొరేట్ తరహా వైద్య సేవలు అందిస్తున్నామన్నారు. శిబిరాలకు వచ్చే వారికి మందులతో పాటు మధ్యాహ్న భోజన సదుపాయాన్ని కల్పిస్తున్నట్లు తెలిపారు. ప్రతి నెలా వేలాదిగా రోగులు తరలివచ్చి వైద్యం చేయించుకుని వ్యాధుల నుంచి విముక్తి పొందటం ఆనందంగా ఉందన్నారు. 1500 మంది వైద్య శిబిరానికి హాజరయ్యారని చెప్పారు. మరిన్ని వైద్య సేవలు అందించేందుకు కృషి చేస్తామన్నారు.


వైద్య శిబిరానికి హాజరైన గ్రామాల ప్రజలు

మలిసంధ్యలో గెలుపు ఉషస్సులు

● మాస్టర్స్ అథ్లెటిక్స్‌లో రాణిస్తున్న మహిళలు

కర్నూలు క్రీడలు, న్యూస్‌టుడే : కర్నూలుకు చెందిన గోళ్ల విజయ కుమారి.. కోసిగికి చెందిన లలిత మాస్టర్స్ అథ్లెటిక్స్‌లో సత్తా చాటుతున్నారు. క్రీడలపై మక్కువతో పాఠశాల, కళాశాల స్థాయిలోనే ప్రతిభ చాటారు. అనంతరం ఒక వైపు ఉద్యోగ బాధ్యతలు నిర్వర్తిస్తూనే మరోవైపు క్రీడల్లో రాణించారు. ఉద్యోగ విరమణ తర్వాత కూడా పోటీల్లో సత్తా చాటుతున్నారు. పరుగు, షాట్‌పుట్, జావెలిన్‌త్రో, హ్యామర్‌త్రో క్రీడల్లో నిత్యం సాధన చేస్తూ ప్రతిభ చూపుతున్నారు. జిల్లా, రాష్ట్ర, జాతీయస్థాయి పోటీల్లో పతకాలు సాధిస్తూ యువతకు ఆదర్శంగా నిలుస్తున్నారు.

బరిలో విజయకుమారి

నగరంలోని చల్లావారివీధికి చెందిన గోళ్ల విజయకుమారి స్కూల్ అసిస్టెంట్ టీచర్‌గా పనిచేసి 2020 సంవత్సరంలో ఉద్యోగ విరమణ చేశారు. తర్వాత అథ్లెటిక్స్‌పై ఆసక్తితో సాధన చేసి పోటీల్లో ప్రతిభ చూపుతున్నారు. ◆ 2024 అక్టోబరులో కర్నూలు డీఎస్‌ఏ స్టేడియంలో జరిగిన మాస్టర్స్ అథ్లెటిక్స్ పోటీల్లో 65 ఏళ్ల పైబడిన విభాగంలో షాట్‌పుట్, జావెలిన్‌త్రో, హ్యామర్‌త్రోలో బంగారు పతకాలు సాధించారు. ◆ 2024 నవంబరులో విశాఖపట్నంలో నిర్వహించిన రాష్ట్రస్థాయి మాస్టర్స్ అథ్లెటిక్స్ పోటీల్లో షాట్‌పుట్, హ్యామర్‌త్రోలో రజత పతకాలు, జావెలిన్‌త్రోలో స్వర్ణం గెలుచుకున్నారు. ◆ 2025 జనవరి 9 నుంచి 19వ తేదీ వరకు జైపుర్‌లో జరిగిన జాతీయ స్థాయి మాస్టర్స్ అథ్లెటిక్స్ మీట్‌లో జావెలిన్ త్రోలో కాంస్యం, షాట్‌పుట్‌లో నాలుగో స్థానం సాధించారు. ◆ 2026 జూన్‌లో ఒలింపిక్ డే సందర్భంగా కర్నూలు డీఎస్‌ఏ స్టేడియంలో నిర్వహించిన జిల్లాస్థాయి పోటీల్లో షాట్‌పుట్, జావెలిన్‌త్రో, హ్యామర్‌త్రోలో బంగారు పతకాలను అందుకున్నారు.



లలిత.. పోటీల్లో ఘనత

కోసిగి గ్రామానికి చెందిన లలిత కర్నూలు నగరంలో ట్రాఫిక్ పోలీస్ కానిస్టేబుల్‌గా విధులు నిర్వర్తిస్తున్నారు. క్రీడలపై ఆసక్తితో పరుగు, హర్డిల్స్ సాధన చేశారు. పోలీస్ శాఖ నిర్వహించే క్రీడా పోటీలు, మాస్టర్స్ అథ్లెటిక్స్‌లో సత్తా చాటుతూ పతకాలు సాధిస్తున్నారు. ◆ 2025 డిసెంబరులో బాపట్లలో జరిగిన రాష్ట్ర స్థాయి మాస్టర్స్ అథ్లెటిక్స్ పోటీల్లో 5 కిలోమీటర్ల పరుగు, 1500, 400 మీటర్ల పరుగులో బంగారు పతకాలు సాధించారు. ◆ 2026 జనవరిలో అజ్మీర్‌లో జరిగిన జాతీయస్థాయి పోటీల్లో 54+ ఏళ్ల విభాగంలో 10 వేల మీటర్ల పరుగు, 300 మీటర్ల హర్డిల్స్‌లో కాంస్య పతకాలు సాధించారు. ◆ 2026 జూన్‌లో ఒలింపిక్ డే సందర్భంగా నిర్వహించిన జిల్లాస్థాయి పోటీల్లో 54+ సంవత్సరాల విభాగంలో 400, 1500, 5కె పరుగులో స్వర్ణ పతకాలను గెలుచుకున్నారు.



ఆకట్టుకున్న బండలాగుడు పోటీలు

డోన్, న్యూస్‌టుడే: శ్రావణమాసం పురస్కరించుకుని గుమ్మకొండ గ్రామ సమీపంలోని ఆంజనేయస్వామి ఆలయంలో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. వివిధ ప్రాంతాల నుంచి ప్రజలు తరలివచ్చి స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆదివారం ఆలయం వద్ద బండలాగుడు పోటీలను డోన్ ఎమ్మెల్యే కోట్లసూర్యప్రకాశ్‌రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు. పోటీల్లో వివిధ ప్రాంతాలకు చెందిన వృషభాలు పాల్గొన్నాయి. విజేతల వృషభాల యజమానులకు నిర్వాహకులు నగదు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో తెదేపా మండల అధ్యక్షులు దశరథరామిరెడ్డి, పీఆర్ఏఈ నారాయణ, శంకర్ తదితరులు పాల్గొన్నారు.


బండ లాగుడు పోటీలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కోట్ల

కొత్తూరు ఆలయానికి రూ.1.10 లక్షల విరాళం


చెక్కును అందిస్తున్న దాతలు

పాణ్యంగ్రామీణ, న్యూస్‌టుడే: మండలంలోని కొత్తూరు సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయ అభివృద్ధికి భక్తులు రూ. 1.10 లక్షలు విరాళం ఇచ్చినట్లు ఈవో రామకృష్ణ తెలిపారు. ఎమ్మిగనూరు పట్టణానికి చెందిన ఫణీంద్రశర్మ తన మనుమడు షణ్ముఖధృవ జన్మదినం సందర్భంగా రూ.లక్ష చెక్కును అందించారు. కర్నూలు పట్టణానికి చెందిన శ్రీకాంత్, సాహిత్య భక్తులు రూ.10 వేలు ఆన్‌లైన్ ద్వారా విరాళం అందించినట్లు పేర్కొన్నారు. స్వామివారి దర్శనం అనంతరం దాతలకు తీర్థప్రసాదాలు అందించినట్లు వివరించారు.

సమస్యలపై నిరంతరం పోరాటం



నాయకురాలికి నియామక పత్రం అందజేస్తున్న దస్తగిరి

బనగానపల్లి, న్యూస్‌టుడే: మాల మహానాడు జిల్లా మహిళా విభాగం నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు మాల జేఏసీ సంఘాల రాష్ట్ర కార్యదర్శి దస్తగిరి తెలిపారు. దొర్నిపాడు మండలం డబ్ల్యూ గోవిందిన్నెకు చెందిన వెంకటలక్ష్మిని జిల్లా మహిళా విభాగం ఉపాధ్యక్షురాలిగా, అవుకు మండలం చనుగొండ్ల గ్రామానికి చెందిన శ్రీరాముల శ్రీదేవిని బనగానపల్లి నియోజకవర్గం అధ్యక్షురాలిగా ఎన్నుకున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మాలల సమస్యలపై నిరంతరం పోరాటం చేస్తామన్నారు. మాలల హక్కుల సాధనకు కలిసికట్టుగా ఉండి ముందుకు పోవాలని సూచించారు. కార్యక్రమంలో సంఘం నాయకులు బి.మద్దిలేటి, నాగరాజు, డి.నాగేంద్రబాబు, కె.శివుడు, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

విద్యుత్తు సమస్యలు పరిష్కరించుకోండి

నంద్యాల రైతునగరం, న్యూస్‌టుడే: విద్యుత్తు వినియోగదారుల సమస్యల పరిష్కారానికి ప్రతి సోమవారం డయల్ యువర్ విద్యుత్తు శాఖ ఎస్ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఎస్ఈ సుధాకర్ కుమార్ తెలిపారు. ప్రజలు తమ సమస్యలను ఉదయం 8.30 నుంచి 9.30 గంటల సమయంలో 08514-222989 నంబరుకు ఫోన్ చేసి చెప్పాలన్నారు. విద్యుత్తు వినియోగదారులు ఈ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

హంద్రీ కాలువలో దూకి దంపతుల ఆత్మహత్యాయత్నం

☛ భార్య మృతి, భర్త గల్లంతు

చిప్పగిరి, న్యూస్‌టుడే: అనంతపురం జిల్లా గుంతకల్లు మండలంలోని హంద్రీ కాలువలో దూకి దంపతులు ఆత్మహత్యకు పాల్పడిన ఘటన ఆదివారం చోటు చేసుకుంది. గుంతకల్లు మండలం కసాపురం ఎస్సై వెంకటస్వామి, స్థానికులు కథనం మేరకు... కర్నూలు జిల్లా చిప్పగిరి మండలం, బెల్డోణ గ్రామానికి చెందిన దంపతులు గుంతకల్లు ఆసుపత్రి వెళ్తున్నామని కుటుంబ సభ్యులకు చెప్పి, కసాపురం బయలుదేరారు. కసాపురం-మద్దికెర మధ్య ప్రవహించే హంద్రీ కాలువలోకి స్నానం చేయడానికి అన్నట్లుగా మొబైల్, చెప్పులు, ఇతర వస్తువులు బయటపెట్టి ఒక్కసారిగా దూకారు. ఇది గమనించిన స్థానికులు రక్షించడానికి ప్రయత్నించేలోగా కాలువలో మునిగిపోయారు. ఒడ్డున పెట్టిన మొబైల్‌తో బంధువులకు సమాచారం అందించారు. విషయం తెలుసుకున్న పోలీసులు, బంధువులు, బెల్డోణ గ్రామస్థులు ఘటనా స్థలానికి హుటాహుటిన చేరుకొని గాలించారు. సోమలింగమ్మ(60) మృతదేహాన్ని వెలికి తీసి గుంతకల్లు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. సీతన్న(64) ఆచూకీ కోసం గాలిస్తున్నారు. వారిద్దరికి ఆరోగ్య పరిస్థితి బాగాలేదని.. సీతన్నకు గత ఏడాది ఆపరేషన్ చేశారని.. ఆ బాధ తట్టుకోలేక ఆత్మహత్యకు పాల్పడి ఉంటారని కసాపురం పోలీస్ స్టేషన్‌లో వారి కుమారుడు నారాయణ ఫిర్యాదు చేశారు. ఈ మేరకు ఎస్సై వెంకటస్వామి కేసు నమోదు చేసుకొని దర్యాప్తు ప్రారంభించారు.


సోమలింగమ్మ (పాత చిత్రం)


సీతన్న

పాము కాటుతో రైతు దుర్మరణం

బేతంచెర్ల, న్యూస్‌టుడే: మండలంలోని ఆర్.కొత్తపల్లె గ్రామానికి చెందిన ఓ రైతు పాము కాటుకు గురై మృతి చెందిన సంఘటన ఆదివారం మధ్యాహ్నం చోటుచేసుకుంది. గ్రామస్థులు తెలిపిన వివరాల మేరకు.. గ్రామానికి చెందిన గురుమోహన్ (45) అనే రైతు పొలం పనులు చేస్తుండగా పాము కాటు వేసింది. వెంటనే బేతంచెర్ల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. మృతుడికి భార్య, కొడుకు, కుమార్తె ఉన్నారు. విషయం తెలుసుకున్న పోలీసులు గ్రామానికి వెళ్లి పాము కాటుకు గురైన రైతు వివరాలను సేకరించి కేసు నమోదు చేసినట్లు హెడ్‌కానిస్టేబుల్ చంద్రశేఖరప్ప తెలిపారు.

సిద్ధవటంలో ధ్వజస్తంభ ప్రతిష్ఠ క్రతువులు

శ్రీశైలం ఆలయం, న్యూస్‌టుడే: నంద్యాల జిల్లాలోని శ్రీశైల దేవస్థానం దత్తత దేవాలయాలమైన కడప జిల్లాలోని సిద్ధవటం క్షేత్రంలో ఆదివారం ధ్వజస్తంభ ప్రతిష్ఠ క్రతువులు జరిగాయి. ఉదయం 8 గంటలకు రుత్వికులు వేదపారాయణం, నవగ్రహ, శివపంచాక్షరీ జపాలు చేశారు. కలశాలకు పూజలు చేశారు. ధ్వజమంత్ర పునశ్చరణ తదితర కార్యక్రమాలు నిర్వహించారు. సోమవారం ఉదయం 8 గంటలకు ప్రతిష్ఠ సంబంధ పారాయణలు, జపాలను చేపడతారు. ఉదయం 10.15 గంటలకు నూతన ధ్వజస్తంభాన్ని ప్రతిష్ఠించనున్నారు. తర్వాత పూర్ణాహుతి తదితర కార్యక్రమాలతో క్రతువులు ముగియనున్నాయి.


కలశాలకు పూజలు చేస్తున్న రుత్వికులు

ఎత్తిపోతల నీరు వృథా

కొత్తపల్లి, న్యూస్‌టుడే: అసలే ఎల్‌నినో.. ఆపై జాతీయ రహదారి నిర్మాణ అధికారుల నిర్లక్ష్యం రైతన్నలకు శాపంగా మారింది. మండలంలోని చిన్నగుమ్మడాపురం బ్రిడ్జి నిర్మాణం వద్ద లీకేజీ ఏర్పడి నీళ్లు వృథాగా పోతున్నాయి. మండల పరిధిలోని ముసలిమడుగు సమీపంలో నిర్మించిన ఎత్తిపోతల నుంచి అధికారులు నీటిని విడుదల చేశారు. ఈ నెల 21వ తేదీన 167కే జాతీయ రహదారి నిర్మాణ పనుల్లో పైపులైన్ దెబ్బతినడంతో మరమ్మతులు చేయించాలని గుమ్మడాపురం, శింగరాజుపల్లె, శివపురం గ్రామాల రైతులు నిరసన చేశారు. శింగరాజుపల్లె గ్రామం వద్ద నిర్మాణ పనుల వాహనాలను అడ్డుకొన్నారు. గుత్తేదారు పైపులైను మరమ్మతు పనులను తూతూమంత్రంగా చేపట్టారు. దీంతో చిన్నగుమ్మడాపురం బ్రిడ్జి నిర్మాణం వద్ద మళ్లీ అదేస్థాయిలో లీకేజీ ఏర్పడి నీళ్లు వృథాగా పారుతున్నాయి. ఆదివారం ఆయా గ్రామాల రైతులు నిరసన వ్యక్తం చేశారు. పైపులైను మరమ్మతులు చేపట్టి నీటి వృథాను అరికట్టాలని రైతులు కోరుతున్నారు. ఈ నెల 28న శింగరాజుపల్లె వద్ద వాల్వ్ బ్లాస్ట్ అయ్యి నీరు వృథా అయ్యాయి.


దెబ్బతిన్న పైపులైనుతో వృథాగా పారుతున్న సాగు నీరు


పైపులైను మరమ్మతులు చేపట్టాలని రైతుల నిరసన

నంద్యాల

• నంద్యాల • నందికొట్కూరు • శ్రీశైలం • పాణ్యం

అనుమానిత ఇళ్లలో సోదాలు


ముసలిమడుగులో కవాతు నిర్వహిస్తున్న ఎస్సై, సిబ్బంది

కొత్తపల్లి: మండల పరిధిలోని ముసలిమడుగు గ్రామంలో ఆదివారం కొత్తపల్లి ఎస్సై జయశేఖర్ సిబ్బందితో కలసి అనుమానితుల ఇళ్లలో సోదాలు చేసి కవాతు నిర్వహించారు. సోదాల్లో భాగంగా వెంకటేశ్వర్లు అనే వ్యక్తి వద్ద నుంచి 20 మద్యం సీసాలు స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు. అనంతరం గ్రామంలో చెడు అలవాట్ల వల్ల జరిగే నష్టాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే చర్యలు ఉంటాయని హెచ్చరించారు.

రాష్ట్రస్థాయి పోటీలకు ఆదర్శ విద్యార్థులు

పాణ్యం గ్రామీణం, న్యూస్‌టుడే: పాణ్యంలో నిర్వహించిన ఆట్యా పాట్యా సబ్ జూనియర్స్ జిల్లా స్థాయి పోటీల్లో స్థానిక ఆదర్శ పాఠశాల విద్యార్థులు ప్రతిభ కనబరిచినట్లు ప్రిన్సిపల్ దినేశ్ తెలిపారు. నలుగురు విద్యార్థులు రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైనట్లు పేర్కొన్నారు.

ముంపు బాధితులకు మద్దతిస్తాం

నందికొట్కూరు గ్రామీణం, న్యూస్‌టుడే: శ్రీశైలం జలాశయం ముంపు బాధితులకు న్యాయం జరిగే వరకు మద్దతిస్తామని మాజీ ఎమ్మెల్యే లబ్బి వెంకటస్వామి తెలిపారు. ఆదివారం పట్టణంలోని జైకిసాన్ పార్కులో నిర్వాసితుల-నిరుద్యోగుల ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ముందుగా ప్రజాసంఘాలు, బాధితులతో కలిసి ముంపు బాధితులు చేపట్టిన దీక్ష వద్ద నుంచి ర్యాలీ చేపట్టారు. ఎంపీ శబరి ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లి ఉద్యోగాలు ఇప్పించాలని కోరారు.


మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే లబ్బి వెంకటస్వామి

సత్ప్రవర్తనతో మెలగాలి

నంద్యాల పాతపట్టణం, న్యూస్‌టుడే: రౌడీషీటర్లు, నేరచరిత్ర కలిగిన వ్యక్తులు సత్ప్రవర్తనతో జీవించాలని ఎస్పీ సునీల్ షొరాణ్ ఆదివారం ఒక ప్రకటనలో సూచించారు. ప్రతి ఆదివారం రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ ఇస్తున్నట్లు తెలిపారు. పోలీసుల మాటలను వినకుండా అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే పీడీ యాక్ట్, బైండోవర్ కేసులు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకుంటామని పోలీసు అధికారులు హెచ్చరించారు.

ఆత్మకూరు పట్టణం, న్యూస్‌టుడే: రౌడీషీటర్లు, పాత నేరస్థులు, బైండోవర్ కలిగిన వ్యక్తులు సత్ప్రవర్తనతో మెలగాలని ఆత్మకూరు అర్బన్ సీఐ మహేశ్వర్‌రెడ్డి సూచించారు. ఆదివారం పోలీసు స్టేషనులో రౌడీషీటర్లకు మంత్రణం నిర్వహించారు.

ఉల్లంఘనులు.. ట్రాఫిక్ చిక్కులు

★ పట్టణంలో ఇష్టానుసారంగా ద్విచక్ర వాహనాల డ్రైవింగ్

నంద్యాల నేరవిభాగం, న్యూస్‌టుడే: పురపాలికల్లో ట్రాఫిక్ సమస్య వేధిస్తోంది. నంద్యాలలోనూ సమస్య తీవ్రంగా ఉంది. ప్రతి వీధిలో ట్రాఫిక్ సమస్యలు నిత్యకృత్యం అవుతుఆన్నాయి. ఎక్కడ చూసినా ట్రాఫిక్ అంతరాయం దృశ్యాలే కనిపిస్తుంటాయంటే సమస్యను అర్థం చేసుకోవచ్చు. దీంతో లక్షలాది మంది నిత్యం ఇబ్బందులు పడుతున్నారు. ఫలితంగా అడుగు తీసి అడుగు ముందుకు వేయాలంటే పాదచారులు అష్ట కష్టాలు పడుతున్నారు. అంతేగాక ట్రాఫిక్ ఉల్లంఘనల కారణంగా ప్రమాదాలు సైతం జరుగుతున్నాయి. సమస్య పరిష్కారంపై అధికారులు దృష్టి సారించాల్సిన అవసరం ఉంది.

● ఇక ట్రాఫిక్‌ను దాటి వాహనం ముందుకు కదలాలంటే... ప్రయాసలు తప్పడం లేదు. నిబంధనల ఉల్లంఘనలు సైతం అధికంగానే ఉంటున్నాయి. ఒకప్పుడు నిబంధన ఉల్లఘిస్తే పట్టుకుని కేసు రాసేవారు. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం అందుబాటులోకి వచ్చిన తర్వాత ఫొటోలు తీసీ ఈ-చలనా విధిస్తున్నారు. వీటికి సంబంధించిన 2026 జనవరి నుంచి జులై వరకు నంద్యాల పట్టణంలో జరిగిన ద్విచక్ర వాహన ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘన వివరాలు ఇలా ఉన్నాయి.

- ఓవర్ స్పీడ్: 212
- డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులు: 1951
- సెల్‌ఫోన్ మాట్లాడుతూ డ్రైవింగ్: 1875
- ట్రిపుల్ రైడింగ్: 2364
- శిరస్త్రాణం లేని వారు: 8014

శిరస్త్రాణం లేని కేసులే ఎక్కువ..

నంద్యాలలో నమోదైన మొత్తం కేసుల్లో శిరస్త్రాణం లేకుండా ద్విచక్ర వాహనం నడిపిన కేసులే ఎక్కువగా ఉన్నాయి. ఆ తర్వాతి స్థానం ట్రిపుల్ రైడింగ్ ఉండటం గమనార్హం. ఆ తర్వాతి స్థానంలో డ్రంకన్ డ్రైవింగ్ కేసులు ఉన్నాయి. అంటే ట్రాఫిక్ ఉల్లంఘనలే ఎక్కువగా ఉంటున్నాయి.

నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు

- సుబ్రహ్మణ్యం, ట్రాఫిక్ సీఐ, నంద్యాల

ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘించిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటున్నాం. డ్రంకన్ డ్రైవ్ కేసులపై జైలు శిక్షలు పడుతున్నాయి. ఎవరైనా నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు తప్పవు. మైనర్ డ్రైవింగ్‌పై ప్రత్యేక దృష్టి సారిస్తున్నాం.

మేమున్నాం.. మీకు తోడుగా..

(10 AM TO 1 PM)
నందికొట్కూరు : 94403 61729
ఆత్మకూరు : 8008573755
నంద్యాల : 98853 28120

నంద్యాల రైతునగరం: ?: ఎన్జీవోస్ కాలనీలో కుక్కల బెడద అధికంగా ఉంది. బయటికి వెళ్లాలంటే భయంగా ఉంది. - **సునీత, స్థానికురాలు** ?: పొన్నాపురం కాలనీలో ఇంటింటి చెత్త సేకరణ సరిగా జరగడం లేదు. - **వెంకటలక్ష్మి, స్థానికురాలు** ✓: సిబ్బందితో కుక్కలను పట్టిస్తాం. ఇంటింటి చెత్త సేకరణ సరిగా జరిగేలా చర్యలు తీసుకుంటాం. - **లక్ష్మీనారాయణ శర్మ, శానిటరీ ఇన్‌స్పెక్టర్**

ఆత్మకూరు పట్టణం: ?: పెద్దబజారు నుంచి వడ్లరామాపురం వెళ్లే రహదారి అధ్వాన్నంగా ఉంది. - **కిరణ్, వాహనదారుడు.** ✓: సిమెంటు రహదారి నిర్మాణం పరిశీలిస్తాం. **-బేబి, మున్సిపల్ కమిషనరు.** ?: కొత్తపేట నుంచి ఇస్లాంపేటకు వెళ్లే మార్గంలో కాల్వ దాటడానికి ఇబ్బందిగా ఉంది. చిన్న పిల్లలు, మహిళలు ఇబ్బందులు పడుతున్నారు. **-సుల్తాన్, స్థానికుడు.** ✓: కాల్వపై బండలు ఏర్పాటు చేస్తాం. - **షాహీర్‌బాష, పురపాలక ఏఈ.**

?: నంద్యాల మలుపు నుంచి వెలుగోడు వెళ్లే మార్గంలో ప్రధాన రహదారి పక్కన వాహనాలు నిలుపుతున్నారు. ప్రమాదం జరిగే అవకాశం ఉంది. - **సుబ్బరాయుడు, వాహనదారుడు.** ✓: వాహనదారులకు హెచ్చరికలు జారీ చేస్తాం. - **నారాయణరెడ్డి, ఎస్సై.** ?: ప్రభుత్వ ఆసుపత్రి ఎదురుగా ఉన్న మురుగు కాల్వలో నీళ్లు దుర్గంధం వెదజల్లుతున్నాయి. దోమలు స్వైరవిహారం చేస్తున్నాయి. - **దాసు, రోగి బంధువు.** ✓: కాల్వలో బ్లీచింగు పౌడరు చల్లుతాం. - **జీవన్, శానిటరీ ఇన్‌స్పెక్టరు**

నందికొట్కూరు గ్రామీణం: ?: కొణిదేల గ్రామంలో కాలువలు లేక చిన్నపాటి వర్షానికే ప్రధాన రహదారులపై నీరు నిలుస్తున్నాయి. - **జనార్దన్, స్థానికుడు** ✓: ఉన్నత అధికారుల దృష్టికి తీసుకెళ్లి సమస్య పరిష్కారానికి కృషి చేస్తాం. - **సుబ్రహ్మణ్యశర్మ, ఎంపీడీవో** ?: కొణిదేల ఎస్సీ కాలనీలో అంగన్‌వాడీ కేంద్రానికి ప్రభుత్వ భవనం లేక ఇబ్బందులు పడుతున్నాం. - **సామేలు, స్థానికుడు** ✓: ఉన్నత అధికారుల దృష్టికి తీసుకెళ్లి నూతన భవనం నిర్మించేందుకు కృషి చేస్తాం. **-మంగవల్లి, సీడీపీవో** ?: బ్రాహ్మణకొట్కూరు గ్రామంలో ప్రధాన రహదారిలో విద్యుత్తు నియంత్రిక రక్షణ కంచె లేక ప్రమాదకరంగా ఉంది. - **అనిల్, స్థానికుడు** ✓: కంచె ఏర్పాటుకు చర్యలు చేపడుతాం. - **శ్రీనివాసులు, ఏడీ**

గడివేముల: ?: బిలకలగూడూరులోని ఎస్సీ కాలనీలో మురుగుకాల్వలు శుభ్రం చేయలేదు. దీంతో దుర్వాసన వస్తోంది. **-వెంకటేశ్వర్లు, స్థానికుడు** ✓: మురుగుకాల్వలు శుభ్రం చేయిస్తాం. - **లక్ష్మన్న, పంచాయతీ కార్యదర్శి**

పాణ్యం గ్రామీణ: ?: పాణ్యంలోని అయ్యపురెడ్డి కాలనీలో దోమలు బెడద అధికమైంది. - **రఘు, కాలనీవాసి** ?: పాణ్యం బస్టాండు నుంచి బనగానపల్లి రహదారిలో మురుగుకాల్వలు శుభ్రం చేయడం లేదు. - **కరీం, స్థానికుడు** ✓: సిబ్బందితో కాల్వలను శుభ్రం చేయిస్తాం. - **వెంకటేశ్వర్లు, పంచాయతీ కార్యదర్శి, పాణ్యం**


దవాఖానా దారి.. అధ్వానంగా మారి..



పురపాలికలోని పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి వెళ్లే మార్గం అధ్వాన్నంగా మారింది. ఆసుపత్రికి వెళ్లే మార్గం గుంతలతో ఎగుడుదిగుడుగా ఉండటంతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. వర్షం కురిస్తే రహదారి బురదమయమై వాహనాలు ఇరుక్కుపోతున్నాయి. కాలినడకన వెళ్లే వారు మొనదేలిన రాళ్లపై నడవటానికి భయపడుతున్నారు. అధికారులు స్పందించి సిమెంటు రహదారి నిర్మిస్తే ఆసుపత్రిలో ఓపి పెరిగి ప్రజలకు మెరుగైన వైద్యం అందే అవకాశముంది. – న్యూస్‌టుడే, ఆత్మకూరు పట్టణం

నోరు తెరిచిన ప్రమాదం

నంద్యాల పట్టణం ఎన్జీవోస్ కాలనీ గురు రాఘవేంద్ర కోచింగ్ సెంటర్ ఎదురుగా సందు కల్వర్టుపై ఏర్పాటు చేసిన మార్గ బిలం మూతలేకుండా ప్రమాదకరంగా ఉంది. రాత్రి సమయాల్లో దీన్ని గమనించకుండా వెళ్తూ ద్విచక్ర వాహనదారులు, పాదచారులు ప్రమాదాల బారిన పడుతున్నారు. అధికారులు చర్యలు తీసుకొని మార్గ బిలంపై మూత ఏర్పాటు చేయాలని స్థానికులు కోరుతున్నారు. – న్యూస్‌టుడే, నంద్యాల రైతునగరం



మహానందిలో పెళ్లిళ్ల జోరు

మహానంది, న్యూస్‌టుడే: మహానంది పుణ్యక్షేత్రంలో ఆదివారం పెళ్లిళ్ల జోరు కొనసాగింది. దేవాలయం ఆవరణ, ప్రత్యేక మండపాల్లో సుమారు 23 వరకు వివాహాలు జరిగాయి. పురోహితుల వేద మంత్రాల మధ్య కుటుంబ సభ్యులు, బంధుమిత్రుల సమక్షంలో జంటలు ఓ ఇంటివారయ్యారు. అంతకుముందు క్షేత్రంలోని పలు పుష్కరిణిల్లో పుణ్యస్నానాలు ఆచరించారు. అనంతరం గంగా కామేశ్వరీదేవి సహిత మహానందీశ్వర స్వామివార్లను దర్శించుకుని, పూజలు చేశారు. ఆదివారం సుమారు 18 వేల మందికిపైగా భక్తులు, పెళ్లివారు మహానందికి రావడంతో క్షేత్రం కళకళలాడింది.

పర్యావరణాన్ని కాపాడుదాం

తిమ్మాపురం, (మహానంది), న్యూస్‌టుడే: ఇంటింటా మొక్కలు నాటి పర్యావరణ సమతుల్యతను పరిరక్షిద్దామని విజయవాడ డీఎస్పీ, పూర్వవిద్యార్థి బి.శ్రీనివాసులు పిలుపునిచ్చారు. మహానంది మండల కేంద్రం ఎం.తిమ్మాపురంలోని జడ్పీ ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయులు సీహెచ్ చంద్రశేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో పూర్వ విద్యార్థులు మొక్కలు నాటారు. కార్యక్రమంలో పూర్వవిద్యార్థులు దేవనాల శ్రీనివాసులు, కళ్లెమద్దిలేటి, గజేంద్రుడు, సీఆర్పీ తిమ్మయ్య, కె.రమణయ్య పాల్గొన్నారు.


గోడపత్రాలు విడుదల చేస్తున్న సంఘం నాయకులు

చలో గుంటూరు విజయవంతం చేయండి

నంద్యాల పట్టణం, న్యూస్‌టుడే: సీపీఎస్ రద్దు చేసి పాత పింఛను పునరుద్ధరణ చేయాలని కోరుతూ సెప్టెంబరు 1వ తేదీన నిర్వహిస్తున్న సమర శంఖం కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని జిల్లా ఏపీ సీపీఎస్ ఎంప్లాయీస్ అసోసియేషన్ అధ్యక్షుడు ప్రతాపరెడ్డి, నాయకుడు ఈశ్వరరెడ్డి తెలిపారు. ఆదివారం స్థానిక బొమ్మలసత్రం పురపాలక ప్రాథమిక పాఠశాలలో సంఘం సమావేశాన్ని నిర్వహించారు. అనంతరం గోడపత్రాలను విడుదల చేశారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు జమీల్ అహ్మద్, పట్టణ శాఖ కార్యవర్గ సభ్యులు పుల్లయ్య నాయక్, రవి తేజ, నాగ వెంకటేశ్వర్లు, మునీర్ బాబు, నారాయణ, మహేంద్రా రెడ్డి, ఈశ్వరయ్య, చెన్నయ్య తదితరులు పాల్గొన్నారు.

10 మందికి కృత్రిమ చేతుల అమరిక

నంద్యాల పట్టణం, న్యూస్‌టుడే: రోటరీ, రెడ్‌క్రాస్ సొసైటీ సంయుక్త నిర్వహణలో ఉచిత కృత్రిమ చేతుల అమరిక జరిగింది. అనంతపురంలో ఆదివారం నిర్వహించిన ఒక కార్యక్రమంలో జిల్లాకు చెందిన 10 మంది లబ్ధిదారులకు రూ.30 వేల విలువజేసే కృత్రిమ చేతులను ఈ మేరకు అమర్చారు. నంద్యాల గురురాజ ఇంగ్లీషు మీడియం పాఠశాల సహకారంతో జిల్లాకు చెందిన 15 మంది లబ్ధిదారులను రెడ్‌క్రాస్ డీఎఫ్‌వో అబ్దుల్లా ఆధ్వర్యంలో అనంతపురానికి తీసుకుపోగా ఇందులో అర్హులైన పది మందికి వీటిని అమర్చారు.


కృత్రిమ చేతులతో లబ్ధిదారులు

వెలిగొండ ప్రాజెక్టుకు గిరిజన విద్యార్థులు

నంద్యాల రైతునగరం, న్యూస్‌టుడే: నేడు వెలిగొండ ప్రాజెక్టు వద్ద జరిగే ప్రారంభోత్సవ కార్యక్రమంలో నృత్య ప్రదర్శన చేయడానికి ఆశ్రమ, గురుకుల పాఠశాలల విద్యార్థినులను ఎంపిక చేసి పంపినట్లు జిల్లా గిరిజన సంక్షేమ అధికారి హుస్సేనయ్య తెలిపారు. జిల్లా నుంచి మొత్తం 105 మంది విద్యార్థినులను గిరిజన సాంప్రదాయ లంబాడీ నృత్య ప్రదర్శన చేసి అలరించనున్నట్లు తెలిపారు.


నృత్య ప్రదర్శన చేయడానికి బయలు దేరుతున్న గిరిజన విద్యార్థినులు

మహిళలకు అండగా శక్తి యాప్

నందికొట్కూరు గ్రామీణం, న్యూస్‌టుడే: మహిళలకు అండగా శక్తి యాప్ పనిచేస్తుందని నందికొట్కూరు పట్టణ సీఐ అశోక్ కుమార్ అన్నారు. పట్టణంలోని కేవీఆర్ గార్డెన్‌లో ఆదివారం పొదుపు మహిళలకు శక్తి యాప్‌పై అవగాహన కల్పించారు. అత్యవసర సమయాల్లో శక్తి వాట్సప్ నెంబర్ 7993485111కు సమాచారం అందిస్తే పోలీసులు రక్షణ కల్పిస్తారని సూచించారు. ఏఎస్సై ఖాదర్ బాషా, కానిస్టేబుల్ రసూల్ తదితరులు పాల్గొన్నారు.

2న కబడ్డీ పోటీలు

నంద్యాల పాతపట్టణం, న్యూస్‌టుడే: శ్రీకృష్ణ జయంతి ఉత్సవాల సందర్భంగా పట్టణంలోని పద్మావతినగర్‌లో వెలసిన కృష్ణ మందిరంలో సెప్టెంబరు 2న కబడ్డీ పోటీలు నిర్వహిస్తున్నట్లు ఉత్సవ కమిటీ సభ్యులు సుబ్రహ్మణ్యం ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రథమ బహుమతి రూ.30 వేలు, రెండో బహుమతి రూ.20 వేలు, మూడో బహుమతి రూ.15 వేలతో పాటు 6వ స్థాయి వరకు నగదు బహుమతి అందజేస్తామన్నారు. ఆసక్తి ఉన్న జట్లు పేరు నమోదు చేసుకోవాలన్నారు.

ఆనందమే ఆరోగ్యం

నంద్యాల పట్టణం, న్యూస్‌టుడే: యాంత్రిక జీవనంలో ఆనందమే ఆరోగ్యమని పలువురు వక్తలు పేర్కొన్నారు. నంద్యాల లాఫింగ్ క్లబ్ సమావేశం ఆదివారం స్థానిక వివేకానంద ఆడిటోరియంలో నిర్వహించారు. క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు డా.గెల్వి సహదేవుడు, మాలేపాటి రాజశేఖర్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ముఖ్య అతిథిగా కందుకూరి శ్రీరామ్మూర్తి పాల్గొన్నారు. ఈ సందర్భంగా సభ్యుల జోక్‌లతో కార్యక్రమం ఆహ్లాదకరంగా సాగింది. కార్యక్రమంలో పాలూరు సుబ్బారావు, శేషయ్య, ప్రసాద్, ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

ట్రై సైకిళ్ల పంపిణీ

నంద్యాల పట్టణం, నంద్యాల పాతపట్టణం, న్యూస్‌టుడే: ఎస్బీఐ సహాయ మేనేజర్ పుల్లయ్య ఆర్థిక సహాయంతో ఏడుగురు దివ్యాంగులకు ట్రై సైకిళ్లను పంపిణీ చేశారు. ఆదివారం జిల్లా దివ్యాంగుల సంక్షేమ సంఘం కార్యాలయంలో నిర్వహించిన ఒక కార్యక్రమంలో రూ.56 వేల విలువజేసే ట్రై సైకిళ్లను ఆయన పంపిణీ చేశారు. కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు ఎంపీవీ రమణయ్య, లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు సందీప్, దివ్యాంగుల సంక్షేమ సంఘం నాయకులు రామలింగం, వెంకటరావు, మురళీధర్, మధు, శివరామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.


సైకిళ్లు అందుకున్న దివ్యాంగులు

సంక్షిప్త సమాచారం

బహుమతుల అందజేత: వెలుగోడు: పట్టణంలోని డీపాల్ పాఠశాలలో మండల స్థాయి చెస్ పోటీలు నిర్వహించారు. సీనియర్స్ విభాగంలో లిటిల్ ఏంజిల్ పాఠశాలకు చెందిన విద్యార్థిని దీక్షశ్రీ ప్రథమ స్థానంలో, ఆదర్శ పాఠశాలకు చెందిన సాయిప్రణీత్ ద్వితీయ స్థానంలో, కేజీబీవీ విద్యార్థిని సుమంజలి తృతీయ స్థానంలో నిలిచినట్లు కరస్పాండెంట్ ఫాదర్ రోయ్ తెలిపారు. ఈ మేరకు విద్యార్థినులకు బహుమతులు అందజేశారు.

కొనసాగుతున్న పూడికతీత పనులు: వెలుగోడు: పట్టణ శివారులోని రామసముద్రం చెరువులో పూడికతీత పనులు కొనసాగుతున్నాయి. గత వారం రోజుల క్రితం వీబీరాంజీ పథకంలో భాగంగా జలధార, జలహారతి ద్వారా పూడికతీత పనులు ప్రారంభించామని ఏపీవో నాగజ్యోతి తెలిపారు.

ప్రమాదంలో ముగ్గురికి గాయాలు: పాణ్యం గ్రామీణం, న్యూస్‌టుడే: మండలంలోని నూలు మిల్లు సమీపాన జాతీయ రహదారిపై రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొని ముగ్గురికి గాయాలైనట్లు స్థానికులు తెలిపారు. ఆదివారం కర్నూలు వైపు వెళుతున్న రెండు బైక్‌లు ఢీకొనడంతో అందులో వెళ్తున్న వారు కిందపడ్డారు. వారిని నంద్యాల వైద్యశాలకు తరలించారు.

ఫుట్‌బోర్డుపై ప్రయాణం.. నిలిచిన బస్సు: పాణ్యంగ్రామీణం, న్యూస్‌టుడే: నంద్యాల నుంచి బేతంచెర్లకు వెళ్తున్న బస్సును అరగంట పాటు నిలిపివేశారు. పాణ్యం వద్ద బస్సులో ఎక్కిన ప్రయాణికుల్లో ఒకరు ఫుట్‌బోర్డుపై నిలబడ్డాడు. బస్సు లోపలికి రావాలని డ్రైవర్ సూచించినా రాకపోవడంతో బస్సును అరగంట సేపు అక్కడే నిలిపివేశారు. తోటి ప్రయాణికులు మందలించడంతో ఆ వ్యక్తి లోపలికి వచ్చాడు. అనంతరం బస్సు బయలుదేరింది.

సీటు కోసం పాట్లు



నందికొట్కూరు-కర్నూలు వెళ్లే ప్రయాణికులు ఆర్టీసీ బస్సులో సీటు కోసం పాట్లు పడుతున్నారు. ఆదివారం సెలవు దినం కావడంతో ప్రయాణికుల రద్దీ పెరిగింది. సీటు వేసేందుకు ప్రయాణికులు పోటీపడ్డారు. దీంతో వారి మధ్య గొడవలు జరిగాయి. ప్రయాణికుల రద్దీకి తగిన బస్సులు లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నట్లు వారు వాపోయారు. అధికారులు స్పందించి సర్వీసులు పెంచాలని ప్రయాణికులు కోరుతున్నారు. – న్యూస్‌టుడే, నందికొట్కూరు గ్రామీణం

నేత్రదానం ఎంతో గొప్పది

నంద్యాల పట్టణం, న్యూస్‌టుడే: ఒక నేత్రం దానం చేస్తే తొమ్మిది మందికి చూపు వచ్చే అవకాశం ఉందని కంటి వైద్యుడు డా.విజయ భాస్కర్ రెడ్డి తెలిపారు. ఆదివారం స్థానిక ఎన్వీఎస్ రోటరీ భవన్‌లో నేత్ర దానంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఒకప్పుడూ నేత్ర దానం చేస్తే ఒకరికి మాత్రమే చూపు వచ్చేదని మారిన సాంకేతిక పరిజ్ఞానంతో తొమ్మిది మందికి చూపు వచ్చే అవకాశం ఉందని వెల్లడించారు. అనంతరం 25 మంది రోటరీక్లబ్ సభ్యులు నేత్రదానం చేయడానికి అంగీకారం తెలుపుతూ అంగీకార పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షులు ఎన్.ప్రసాద్‌రెడ్డి, లక్ష్మీకాంతరెడ్డి, ఎన్సీ.మోహన్‌రెడ్డి, కందుకూరి శ్రీరామ్మూర్తి, గవర్నమెంట్ టెక్నీషియన్ కిశోర్ తదితరులు పాల్గొన్నారు.


నేత్రదానానికి అంగీకరిస్తూ పత్రాలు చూపుతున్న రోటరీక్లబ్ సభ్యులు

శుద్ధజల కేంద్రం బాగు చేయండి

బండిఆత్మకూరు, న్యూస్‌టుడే: మండలంలోని ఎ.కోడూరు గ్రామ ఎస్సీ కాలనీలో ఉన్న ఆర్వో ప్లాంట్ గత పది రోజుల క్రితం మరమ్మతులకు గురైంది. దీంతో తాగునీటి కోసం కాలనీ వాసులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఆదివారం వ్యవసాయ కార్మిక సంఘం నాయకుడు డేవిడ్ ఆధ్వర్యంలో కాలనీవాసులు ఆర్వో ప్లాంట్ ఎదుట నిరసన చేశారు.

6న కన్య పాశుపత హోమం

నంద్యాల పట్టణం, న్యూస్‌టుడే: నంద్యాలలో వచ్చే నెల 6న కన్య పాశుపత హోమం నిర్వహిస్తున్నట్లు బ్రాహ్మణ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి నగరడోణ సుధీర్ తెలిపారు. స్థానిక రైల్వేస్టేషన్ సమీపంలోని కోదండ రామాలయంలో పెద్ద ఎత్తున ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఆయన వెల్లడించారు.

చెట్టు పడి విద్యుత్తు సరఫరాకు అంతరాయం

సున్నిపెంట సర్కిల్, న్యూస్‌టుడే: స్థానిక వెస్టన్ కాలనీలోని శ్రీశైలం-హైదరాబాద్ రహదారి పక్కన ఉన్న విద్యుత్తు తీగలపై ఆదివారం తెల్లవారుజామున చెట్టు పడి విద్యుత్తు సరాఫరాకు అంతరాయం ఏర్పడింది. ఆ సమయంలో అటువైపు వాహనాల రాకపోకలు లేకపోవడంతో పెద్ద ప్రమాదం తప్పింది. విద్యుత్తు శాఖ అధికారులు స్పందించి వెంటనే రహదారికి అడ్డుగా ఉన్న చెట్టును తొలగించి ప్రయాణికులకు ఇబ్బందులు లేకుండా చర్యలు చేపట్టారు. తీగలను సరిచేసి కాలనీలో విద్యుత్తు సరఫరాను పునరుద్ధరించారు.

డ్రైనేజీ నిర్మాణం అడ్డగింత

జూపాడుబంగ్లా, న్యూస్‌టుడే: జూపాడుబంగ్లాలో జాతీయ రహదారికి అనుసంధానంగా రోడ్డుకు ఇరువైపులా నిర్మిస్తున్న డ్రైనేజీ కాల్వ పనులను గ్రామస్థులు అడ్డుకున్నారు. గ్రామంలో ఎస్ఎస్సీ క్వార్టర్స్ వరకు రోడ్డుకు ఆనుకుని నాలుగు మీటర్ల మేర కాల్వల నిర్మాణం చేపట్టి, సంతగేటు సమీపంలో ఆరు మీటర్ల మేర పనులు చేపడుతుండటంతో గుత్తేదారుతో గ్రామస్థులు వాగ్వివాదానికి దిగారు. గ్రామంలో అంతటా ఒకే కొలతలతో పనులు చేయాలని నిలదీశారు. దీంతో గుత్తేదారు వెంకటరెడ్డి వెనుదిరిగారు.



రక్తదాతను అభినందిస్తున్న నిర్వాహకులు

రక్తదానం ప్రాణదానంతో సమానం

బేతంచెర్ల, న్యూస్‌టుడే: ప్రతి ఒక్కరూ మానవత్వంతో ముందుకు వచ్చి రక్తదానం చేస్తే ఆపద సమయంలో బాధితులకు ప్రాణం దానం చేసిన వారు అవుతారని బలిజ సంఘం నాయకులు పేర్కొన్నారు. పట్టణంలోని సుమేధ పాఠశాల ఆవరణలో ఆదివారం మండల బలిజ సంఘం ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా 40 మంది యువకులు ముందుకు వచ్చి రక్తదానం చేశారు.

ఆళ్లగడ్డ

• ఆళ్లగడ్డ • బనగానపల్లి • డోన్

జడ్పీ పాఠశాలకు క్రీడా పురస్కారం

చాగలమర్రి, న్యూస్‌టుడే: పట్టణంలోని జడ్పీ బాలుర ఉన్నత పాఠశాల స్పోర్ట్స్ అచీవ్‌మెంట్‌లో 84 పాయింట్లతో జిల్లాలో ఐదవ స్థానాన్ని సాధించి క్రీడా పురస్కారం కైవసం చేసుకుందని ప్రధానోపాధ్యాయుడు జీవయ్య తెలియజేశారు. జాతీయ క్రీడా దినోత్సవం సందర్భంగా డిప్యూటీ డీఈవోలు శంకరప్రసాదు, వెంకట్రామిరెడ్డిల చేతుల మీదుగా అవార్డు అందుకున్నామన్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా..

(10 AM TO 1 PM)
ఆళ్లగడ్డ: 8008 574916
డోన్ పట్టణం: 94408 57790
బనగానపల్లె: 80085 73763

కొలిమిగుండ్ల, న్యూస్‌టుడే: ?: మీర్జాపురం గ్రామంలోని బీసీ కాలనీలో చాలా చోట్ల వీధి దీపాలు వెలగటం లేదు. రాత్రి వేళ రాకపోకలకు అవస్థలు పడుతున్నాం. - **వెంకటరమణ, కాలనీవాసి.** ✔: విషయాన్ని పంచాయతీ కార్యదర్శికి తెలియజేసి వీధి దీపాలు వెలిగేలా చర్యలు చేపడతాం. -**ప్రసాదరెడ్డి, ఎంపీడీవో, కొలిమిగుండ్ల.**

కోవెలకుంట్ల గ్రామీణం, న్యూస్‌టుడే: ?: క్రా సుబ్బారెడ్డి కాలనీలో సీసీ రహదారి దెబ్బతింది. దారి నిర్మించండి. - **మురళి, స్థానికుడు.** ✔: పరిశీలించి చర్యలు తీసుకుంటాం. - **ప్రకాష్‌నాయుడు, ఇన్‌ఛార్జి ఈవో**

డోన్ పట్టణం, న్యూస్‌టుడే: ?: శ్రీనివాసనగర్‌లోని ఆంజనేయస్వామి గుడి వీధిలో ప్రధాన కాల్వలో పూడిక, వ్యర్థాలు పేరుకుపోయి అపరిశుభ్రంగా మారింది. దుర్గంధం వస్తుండటంతో జనం ఇబ్బందులు పడుతున్నారు. - **చంద్రశేఖర్, శ్రీనివాసనగర్.** ✔: కాల్వలో పేరుకుపోయిన పూడిక, వ్యర్థాలను తొలగించి పరిశుభ్రం చేయిస్తాం. - **సునీల్, ఇన్‌ఛార్జి శానిటరీ అధికారి.**

ఆళ్లగడ్డ గ్రామీణం, న్యూస్‌టుడే: ?: కోట కందుకూరు గ్రామంలో పొలం రస్తాలో చెత్త పడేస్తుండటంతో రాకపోకలకు ఇబ్బందిగా మారింది. - **మస్తాన్, కోటకందుకూరు.** ✔: చెత్త వేయకుండా చర్యలు తీసుకుంటాం. - **నూర్జహాన్, ఎంపీడీవో.**

శిరివెళ్ల, న్యూస్‌టుడే: ?: గోవిందపల్లె నూతన ఎస్సీ కాలనీలో వీధిదీపాలు ఏర్పాటు చేయాలి. - **సావిత్రి, కాలనీవాసి.** ✔: సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటాం. - **శివమల్లేశ్వరప్ప, ఎంపీడీవో, శిరివెళ్ల.**

రుద్రవరం, న్యూస్‌టుడే: ?: బొరుగులపేట, బెస్త కాలనీల్లోని శివారు ప్రాంతాల్లో కుళాయిలకు నీటి సరఫరా కావడం లేదు. - **సురేష్, కాలనీవాసి**

✔: నీటి సరఫరా చేసే విధంగా చర్యలు తీసుకుంటాం. - **రామకృష్ణ, పంచాయతీ కార్యదర్శి.**

టెట్ నుంచి మినహాయించాలి



గోడపత్రాలను విడుదల చేస్తున్న యూటీఎఫ్ నాయకులు

ప్యాపిలి, న్యూస్‌టుడే: ఇన్‌సర్వీస్ ఉపాధ్యాయుల టెట్ రద్దు కోరుతూ సెప్టెంబరు 3న నిర్వహించే చలో విజయవాడ కార్యక్రమం జయప్రదం చేయాలని యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి అబ్దుల్ లతీఫ్ పిలుపునిచ్చారు. స్థానిక ప్రియదర్శిని పాఠశాలలో చలో విజయవాడకు సంబంధించిన గోడపత్రాలను ఆదివారం విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 20 నుంచి 30 ఏళ్లుగా పనిచేస్తున్న ఉపాధ్యాయులకు ఇప్పుడు మళ్లీ టెట్ నిర్వహించడం అన్యాయమన్నారు. కార్యక్రమాన్ని ఉపాధ్యాయులు పెద్దఎత్తున పాల్గొనాలని కోరారు. కార్యక్రమంలో ఆస్మా, పక్కీరమ్మ, రాజు, భాస్కర్, సురేష్ పాల్గొన్నారు.

తెలుగుభాషకు చేస్తున్న కృషికి గుర్తింపు

డోన్ పట్టణం, డోన్, న్యూస్‌టుడే: తెలుగు భాషకు చేస్తున్న కృషికి గుర్తింపు లభించిందని తెలుగు సాహితీవేత్తలు చిట్యాల దేవేంద్రప్ప, అనుగోలు సంజీవరాయుడులు పేర్కొన్నారు. గిడుగు వెంకట రామ్మూర్తి జయంతి, తెలుగు భాషా దినోత్సవాన్ని పురస్కరించుకొని కర్నూలులోని టీజీవీ కళాక్షేత్రంలో ఆదివారం వేడుకలను నిర్వహించి తెలుగు కవులను సత్కరించారు. సత్కారం పొందిన వారిలో డోన్ ప్రాంతానికి చెందిన తెలుగు పండితులు దేవేంద్రప్ప, అనుగోలు సంజీవరాయుడులు ఉన్నారు.

అర్జీలు ఇచ్చాం.. ఆశతో ఉన్నాం

◆ సమస్యలు పరిష్కరించాలని ప్రజల వేడుకోలు

బనగానపల్లి, న్యూస్‌టుడే: ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా ప్రజా సమస్యల పరిష్కార వేదిక తీసుకొచ్చింది. ప్రతి సోమవారం తహసీల్దారు, ఆర్డీవో, కలెక్టర్ కార్యాలయాల్లో పీజీఆర్ఎస్ జరుగుతోంది. ఇందులో వివిధ సమస్యలను ఫిర్యాదుదారులు అర్జీరూపంలో అధికారులకు విన్నవిస్తారు. భూ సమస్యలే అధికంగా వస్తుంటాయి. దరఖాస్తులు ఇచ్చి వెళ్లే వరకే బాధితుడు పని. . వాటిని పరిష్కరించడంలో అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారు. పీజీఆర్ఎస్ రోజు పూర్తిస్థాయిలో అధికారులు హాజరు కాకపోవడంతో చాలా వరకు సమస్యలు పరిష్కారం కావడం లేదు. రెవెన్యూ అధికారులు మినహా ఇతర శాఖల అధికారులు తమకేం పట్టనట్లు వ్యవహరిస్తుంటారు. వచ్చిన అధికారులు గంటలోపు కూర్చొని వెళ్లి పోతున్నారు. ఇచ్చిన సమస్యను పరిష్కరించాలని ప్రజలు కార్యాలయం చుట్టూ తిరిగే పరిస్థితి నెలకొంది.

యంత్రాంగం అలసత్వం

★ ఈ ఏడాది జనవరి నుంచి ఆగస్టు 28 వరకు 29 పీజీఆర్ఎస్ నిర్వహించారు. నియోజకవర్గంలోని బనగానపల్లి, అవుకు, సంజామల, కొలిమిగుండ్ల, కోవెలకుంట్ల మండలాల డివిజన్ పరిధిలో 1290 వరకు అర్జీలు రాగా.. ఇందులో సుమారు 715 వరకు పరిష్కారం అయినట్లు అధికారులు చెబుతున్నారు. మిగిలిన 575 దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయి. ఇందులో ప్రధానంగా జిల్లా కేంద్రం నుంచి వచ్చిన వాటికే పరిష్కారం చూపినట్లు తెలుస్తోంది.

★ తహసీల్దారు కార్యాలయానికి వచ్చిన సమస్యలు మాత్రం కనీసం యాభై శాతం కూడా పరిష్కరించలేకపోయారు. జిల్లా కేంద్రం నుంచి వచ్చే సమస్యలు పరిష్కారానికి 21 రోజుల వ్యవధి ఉంటుంది. ఆలోగా అధికారులు ఫిర్యాదుదారులను పిలిచి సమస్యలు పరిష్కరిస్తారు. మిగిలిన సమస్యల పరిష్కారం కోసం అధికారులు ఏదో ఒక సాకుతో ప్రజలను కార్యాలయం చుట్టూ తిప్పుకొంటున్నారు. ఇక ఆర్డీవో కార్యాలయానికి 286 అర్జీలు రాగా ఇందులో 190 వరకు పరిష్కరించారు.



బాధితుల సమస్యలు తెలుసుకుంటున్న ఆర్డీవో నరేంద్రనాథ్‌రెడ్డి

ఎనిమిది నెలల కాలంలో వచ్చిన దరఖాస్తులు

మండలం	సమస్యలు	పరిష్కారం	పెండింగ్
బనగానపల్లి	520	310	210
కోవెలకుంట్ల	180	100	80
అవుకు	215	108	107
కొలిమిగుండ్ల	225	112	113
సంజామల	150	85	65
ఆర్డీవో కార్యాలయం	286	190	96

చర్యలు తీసుకుంటాం

– నరేంద్రనాథ్‌రెడ్డి, ఆర్డీవో, బనగానపల్లి

డివిజన్ పరిధిలో నిర్వహించే పీజీఆర్ఎస్ కార్యక్రమంలో ప్రజల నుంచి వచ్చిన సమస్యలను స్వీకరించి పరిష్కారం చేస్తున్నాం. ఆయా శాఖల అధికారులు హాజరు కాక పోతే వారిపై చర్యలు తీసుకుంటాం. అర్జీలను అక్కడే పరిశీలించి సంబంధిత అధికారులకు పంపిస్తాం. ఎక్కువగా రెవెన్యూ సమస్యలే వస్తుంటాయి. వాటిని క్షేత్రస్థాయిలో పరిశీలించి పరిష్కరిస్తాం.

మైదానం కరవు.. క్రీడలు బరువు

అహోబిలం గ్రామంలోని గిరిజన ఆశ్రమ పాఠశాలకు ఆట స్థలం కరవైంది. బడిలో ఆటస్థలం లేకపోవడంతో విద్యార్థులు ఆటలకు దూరమవుతున్నారు. గతంలో పాఠశాల ఎదురుగా ఖాళీ స్థలం ఉండటంతో తాత్కాలికంగా విద్యార్థులను ఆడించేవారు. ఆలయ పరిధిలోని స్థలం కావడంతో నిర్మాణాలు చేపడుతుండటంతో అది కూడా దూరమైంది. ఇక్కడ 1వ తరగతి నుంచి పదో తరగతి వరకు 200 మంది విద్యార్థులు చదువుతున్నారు. అధికారులు దృష్టి సారించి పాఠశాలకు మైదానం కేటాయించాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు. – న్యూస్‌టుడే, ఆళ్లగడ్డ గ్రామీణం



ఎల్‌నినో ప్రభావం.. చెట్లకు తాపం



ఈ ఏడాది ఎల్‌నినో ప్రభావం ఎంత తీవ్రంగా ఉందో ఈ చిత్రాలను చూస్తేనే తెలుస్తోంది. వర్షాలు కురిసి పచ్చగా ఉండాల్సిన మామిడి తోటలు చినుకు లేక 20 నుంచి 30 ఏళ్ల చెట్లు ఎండిపోతున్నాయి. ఏళ్లపాటు కాపాడుకుంటూ వచ్చిన చెట్లు కళ్లెదుటే ఎండిపోతున్నా.. ఏం చేయలేని స్థితిలో అన్నదాతలు ఉన్నారు. డోన్ మండలంలోని యు. కొత్తపల్లె, ఉంగరానిగుండ్ల తదితర గ్రామాలతో పాటు పలు గ్రామాల్లో ఇలా మామిడి తోటల్లో చెట్లు ఎండిపోయి కరవు పరిస్థితిని చాటిచెబుతున్నాయి. – న్యూస్‌టుడే, డోన్

నిలిచిన నిధులు.. ఆగిన పనులు

బేతంచెర్ల మండలంలోని గొర్లగుట్ల గ్రామంలో వైకాపా హయాంలో రూ. 17. 50 లక్షల నిధులతో విలేజ్ హెల్త్ క్లినిక్ (ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్) నిర్మాణ పనులు చేపట్టారు. నిధుల మంజూరులో జాప్యంతో పాటు వైకాపా ప్రభుత్వం మారడం కూటమి ప్రభుత్వం రావడంతో పనులు నిలిచిపోయాయి. ఆరోగ్య సిబ్బందికి సొంత భవనం లేకపోవడంతో అద్దె భవనంలో, రైతు సేవా కేంద్రంలో ప్రజలకు ఆరోగ్య సేవలు అందిస్తున్నారు. ప్రభుత్వం స్పందించి నిర్మాణం పూర్తి చేసి వినియోగంలోకి తీసుకురావాలని కోరుతున్నారు. –న్యూస్‌టుడే, బేతంచెర్ల



నిర్మించారు.. తాళాలు వేశారు



చిన్నమల్కాపురం రైల్వే స్టేషన్‌లో ప్రయాణికుల సౌకర్యార్థం రూ. లక్షలతో మరుగుదొడ్లు నిర్మించారు. అయితే వాటిని వినియోగించకుండా తాళాలు వేసి నిరుపయోగంగా ఉంచారు. డోన్, నంద్యాల, తదితర ప్రాంతాలకు వెళ్లేందుకు నిత్యం ప్రయాణికులు రైల్వేస్టేషన్ వస్తుంటారు. అత్యవసర పరిస్థితుల్లో ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. రైలు వచ్చినప్పుడు అందులోని మరుగుదొడ్లను ఆశ్రయించాల్సిన పరిస్థితి ఏర్పడుతుందని ప్రయాణికులు వాపోతున్నారు. అధికారులు స్పందించి వాటిని వినియోగంలోకి తీసుకురావాలని కోరుతున్నారు. – న్యూస్‌టుడే, డోన్ పట్టణం

యోగాతో మానసిక ప్రశాంతత



యోగాసనాలపై అవగాహన కల్పిస్తున్న శైలజారెడ్డి

డోన్, న్యూస్‌టుడే: నిత్యం యోగా సాధనతో మానసిక ప్రశాంతత లభిస్తుందని యోగా శిక్షకురాలు, ఇన్నర్‌వీల్ క్లబ్ అధ్యక్షురాలు శైలజారెడ్డి పేర్కొన్నారు. స్థానిక ఆదర్శ పాఠశాల వసతిగృహంలో ఐదు రోజులపాటు విద్యార్థులకు యోగా శిక్షణా తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థినులకు యోగాసనాలపై అవగాహన కల్పించి వాటి వల్ల కలిగే ఉపయోగాలు తెలియజేశారు. ఆదివారం విద్యార్థులకు యోగా పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. యోగాసనాలతో ఎన్నో రకాల అనారోగ్య సమస్యలను నివారించవచ్చన్నారు. కార్యక్రమంలో రాధ, షాహీదా, హీనా, తేజ, వార్డెన్ సునీత పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

బేతంచెర్ల, న్యూస్‌టుడే: ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను పార్టీలకతీతంగా అందించడమే తెదేపా ప్రధాన లక్ష్యమని పార్టీ జిల్లా కార్యనిర్వాహక కార్యదర్శి బుగ్గన ప్రభాకర్ రెడ్డి, ఎంపీటీసీ మాజీ సభ్యుడు జాకీరుల్లాబేగ్ పేర్కొన్నారు. పట్టణంలోని వివిధ కాలనీల్లో 'ఇంటింటికి తెదేపా' కార్యక్రమం నిర్వహించి ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి గురించి వివరించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు రాష్ట్రాన్ని అభివృద్ధి బాటలో నడుపుతున్నారని, మెగా డీఎస్సీ ద్వారా 16,500 ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేసిన ఘనత తెదేపాదే అని అన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను ఓర్వలేక గొడ్డలి పార్టీ విమర్శలు చేస్తుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో లోకేష్‌గౌడ్, వెంకటేశ్వరరెడ్డి, దస్తగిరి, అబ్దుల్లా పాల్గొన్నారు.

భూసార పరీక్షలతో ప్రయోజనం

శిరివెళ్ల, న్యూస్‌టుడే: గ్రామాల్లోని రైతులు భూసార పరీక్షల ఆధారంగా పంటలను సాగు చేసుకోవాలని ఏవో సుధాకర్ ఆదివారం పేర్కొన్నారు. ఏవో మాట్లాడుతూ.. భూసార పరీక్షల ఫలితాల ఆధారంగా ఎరువుల వేయాలన్నారు. రసాయనిక ఎరువుల వాడకం తగ్గించాలన్నారు. సేంద్రియ ఎరువుల వాడకం పెంచాలన్నారు. తగిన మోతాదులో మాత్రమే పురుగు మందుల వినియోగించాలన్నారు.

సంక్షిప్త సమాచారం

శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే చర్యలు: డోన్ నేరవిభాగం, న్యూస్‌టుడే: శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే చర్యలు కఠినంగా ఉంటాయని పట్టణ సీఐ ఇంతియాజ్‌బాషా పేర్కొన్నారు. ఆదివారం పట్టణ పోలీస్‌స్టేషన్‌లో రౌడీషీటర్లకు మంత్రణం నిర్వహించారు.

పౌష్టికాహారంతో ఆరోగ్యం: డోన్, న్యూస్‌టుడే: పౌష్టికాహారంతో చక్కటి ఆరోగ్యం లభిస్తుందని దాత మల్లిరెడ్డి జనార్దన్‌రెడ్డి అన్నారు. ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు ప్రార్థనా సమయం నిర్వాహకులు జానా ప్రభాకర్ ఆధ్వర్యంలో పౌష్టికాహారం అందజేశారు.

నేరప్రవృత్తిని విడనాడాలి: శిరివెళ్ల, న్యూస్‌టుడే: రౌడీషీటర్ల నేర ప్రవృత్తిని విడనాడాలని సీఐ రాము పేర్కొన్నారు. శిరివెళ్ల పోలీస్ స్టేషన్లో రౌడీషీటర్లకు ఆదివారం సీఐ మంత్రణం నిర్వహించారు. గ్రామాల్లో ప్రశాంత వాతావరణం నెలకొనేలా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు.

కుక్క దాడిలో బాలుడికి గాయాలు: కొలిమిగుండ్ల, న్యూస్‌టుడే: మండలంలోని యర్రగుడి గ్రామానికి చెందిన ఇవాన్ రాబర్ట్ అనే బాలుడికి కుక్క దాడిలో గాయాలయ్యాయి. కుటుంబసభ్యులు బాలుడిని చికిత్స నిమిత్తం వైఎస్సార్ కడప జిల్లా జమ్మలమడుగు వైద్యశాలకు తరలించారు.

అమడాలలో పోలీసుల తనిఖీలు: కోవెలకుంట్ల, న్యూస్‌టుడే: అమడాల గ్రామంలో సీఐ హనుమంతనాయక్, ఎస్సైలు మల్లికార్జునరెడ్డి, ధనుంజయులు పోలీసు సిబ్బందితో కలిసి ఆదివారం తెల్లవారుజామున విస్తృత తనిఖీలు నిర్వహించారు. అనుమానిత ఇళ్లల్లో, దుకాణాల్లో సోదాలు చేసి 40 మద్యం సీసాలు స్వాధీనం చేసుకొని ఇద్దరిని అదుపులోకి తీసుకున్నారు.

శ్రావణం.. ఆధ్యాత్మిక సంబరం



ఆళ్లగడ్డ గ్రామీణం: పూజలందుకున్న స్వామి, అమ్మవార్లు

ఆళ్లగడ్డ గ్రామీణం, న్యూస్‌టుడే: మండలంలోని ఆర్. కృష్ణాపురం గ్రామంలోని రామతీర్థం పుట్టాలమ్మ ఆలయం ఆదివారం భక్తులతో కిటకిటలాడింది. శ్రావణమాసం నేపథ్యంలో దూర ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. ఆలయ ఆవరణలోని బావుల వద్ద చన్నీటి స్నానాలు ఆచరించి ఉపవాస దీక్షలతో దీపాలు వెలిగించారు. పుట్టాలమ్మ, పరశురామలింగేశ్వర, లక్ష్మీనృసింహస్వామి, శ్రీవల్లి దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామిని దర్శించుకున్నారు. తలనీలాలు, చీరసారెలు, బియ్యం బేడలు వంటి చిరుకానుకలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయ ఈవో సాయిజయచంద్రారెడ్డి భక్తులకు దాతల సహకారంతో అన్నదానం చేశారు.

దొర్నిపాడు, ఉయ్యాలవాడ, న్యూస్‌టుడే: మండలంలోని డబ్ల్యూ గోవిందిన్నె గ్రామంలో ఆదివారం మూల పెద్దమ్మతల్లి ఆలయంలో భక్తులు ప్రత్యేక పూజలు చేశారు.



ఉయ్యాలవాడ: గంగమ్మకు బోనాలు తీసుకెళ్తున్న మహిళలు

పెద్ద సంఖ్యలో తరలి వచ్చి అమ్మవారికి మొక్కులు తీర్చుకున్నారు. ఉయ్యాలవాడలో గంగ పుత్రులు వర్షం కోసం గంగమ్మకు బోనాలు సమర్పించి పూజలు చేపట్టారు.

బనగానపల్లి గ్రామీణం, న్యూస్‌టుడే: నందవరం చౌడేశ్వరీదేవి ఆలయం, యాగంటి ఉమామహేశ్వరస్వామి ఆలయాలు ఆదివారం భక్తుల సందడితో కనిపించాయి. సెలవు రోజు కావడంతో వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు స్వామి, అమ్మవార్లకు పూజలు చేశారు.

ఆలయాల అభివృద్ధికి విరాళాలు

నందవరం(బనగానపల్లి గ్రామీణం), న్యూస్‌టుడే: బనగానపల్లి మండలం నందవరం గ్రామంలోని చౌడేశ్వరిఅమ్మవారి ఆలయాభివృద్ధికి వైఎస్సార్ కడప జిల్లా ప్రొద్దుటూరుకు చెందిన శ్రీనివాసులు, అనురాధ



విరాళాన్ని అందజేస్తున్న దాతలు

కుటుంబ సభ్యులు రూ. 25 వేల విరాళాన్ని ఆలయ సిబ్బందికి ఆదివారం అందజేశారు. అంతకుముందు దాతలు అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు.

యాగంటి(బనగానపల్లి గ్రామీణం), న్యూస్‌టుడే: బనగానపల్లి మండలం యాగంటి ఉమామహేశ్వరస్వామి ఆలయాభివృద్ధికి హైదరాబాదుకు చెందిన చంద్రకాంత్, కనకదుర్గ దంపతులు రూ. 10 వేలు, అలాగే హైదరాబాదుకు చెందిన విజయరాం కుటుంబ సభ్యులు రూ. 10 వేలు విరాళాన్ని ఆలయ సిబ్బందికి ఆదివారం అందజేశారు. అనంతరం దాతలు స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం అర్చకులు దాతలను సత్కరించి ప్రసాదాలు అందించారు. కార్యక్రమంలో ఆలయ సిబ్బంది, దాత కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

ఘనంగా విగ్రహ ప్రతిష్ఠ ఉత్సవాలు

ఆధ్యాత్మికం

బత్తలూరు(ఆళ్లగడ్డ గ్రామీణం), న్యూస్‌టుడే: మండలంలోని బత్తలూరు గ్రామంలో సీతారామాంజనేయ స్వామి ఆలయంలో విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవం ఘనంగా నిర్వహిస్తున్నారు. ఆదివారం సీతారామాంజనేయ ఉత్సవ విగ్రహాలను గ్రామోత్సవం జరిపారు. నవగ్రహ, రుద్ర, మహానారాయణ హోమాలు చేశారు. సాయంత్రం పుష్ప, ఆదివాస హోమాలు జరిపారు. సోమవారం యంత్ర, విగ్రహ, ప్రాణ ప్రతిష్ఠలు నిర్వహించనున్నారు. పూజల్లో పాల్గొన్న భక్తులకు తీర్థప్రసాదాలు అందించారు.



అలంకరణలో దేవతామూర్తులు

సంజామల, న్యూస్‌టుడే: మండల కేంద్రమైన సంజామల ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పూర్వ విద్యార్థుల సహకారంతో ఏర్పాటు చేసిన సరస్వతీదేవి విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమం ఆదివారం వైభవంగా జరిగింది. ఈ కార్యక్రమం గ్రామానికి చెందిన పూర్వవిద్యార్థి మదన్‌గోపాల్ ఆధ్వర్యంలో పూర్వ విద్యార్థులు రూ. 30 వేలు విరాళం సేకరించి పాఠశాలలో విగ్రహ ప్రతిష్ఠకు పూనుకున్నారు. అర్చకుల సమక్షంలో పూర్వవిద్యార్థులు ప్రత్యేక పూజలు నిర్వహించి విగ్రహాన్ని ప్రతిష్ఠించారు. కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థులకు నిర్వాహకులు తీర్థప్రసాదాలు అందించటంతో పాటు అన్నదానం చేశారు.



సంజామల: ఉత్సవంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు

నేరాలకు పాల్పడితే కఠిన చర్యలు

బేతంచెర్ల, న్యూస్‌టుడే: మండలంలో త్వరలో జరిగే మున్సిపల్, స్థానిక ఎన్నికల సందర్భంగా ఎవరైనా గొడవల్లో జోక్యం చేసుకుంటే కఠిన చర్యలు తీసుకుంటామని సీఐ వెంకటేశ్వరరావు హెచ్చరించారు. స్థానిక పోలీసు స్టేషన్‌లో ఎస్సై రమేష్ బాబుతో రౌడీషీటర్లకు ఆదివారం మంత్రణం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ అల్లర్లకు దూరంగా ఉంటూ ప్రశాంత వాతావరణంలో జీవించాలని సూచించారు. శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు.

కోవెలకుంట్ల, న్యూస్‌టుడే: రౌడీషీటర్లు నేరాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని సీఐ హనుమంతనాయక్ అన్నారు. కోవెలకుంట్ల పోలీసు స్టేషన్ ఆవరణలో ఎస్సై మల్లికార్జునరెడ్డి ఆధ్వర్యంలో రౌడీషీటర్లకు ఆదివారం మంత్రణం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ రౌడీషీటర్లు మంచి ప్రవర్తనతో జీవించాలన్నారు. రానున్న ఎన్నికల నేపథ్యంలో రౌడీషీటర్లపై ప్రత్యేక నిఘా పెంచామన్నారు. గ్రామాల్లో ప్రజల శాంతిభద్రతలకు భంగం కలిగించిన, గొడవలను ప్రేరేపించిన కేసులు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకుంటామన్నారు.

రహదారి ప్రమాదాల నివారణే ధ్యేయం



డ్రైవర్ ముఖం కడిగిస్తున్న సీఐ నాగరాజారావు

చాగలమర్రి, న్యూస్‌టుడే: రాత్రి వేళల్లో జరిగే రహదారి ప్రమాదాలను అరికట్టడమే ధ్యేయంగా పోలీస్ శాఖ ప్రత్యేక చర్యలు చేపట్టిందని ఆళ్లగడ్డ పట్టణ సీఐ నాగరాజారావు తెలియజేశారు. ఎస్పీ సునీల్ షొరాణ్ ఆదేశాల మేరకు చాగలమర్రి పట్టణ సమీపంలోని జాతీయ రహదారిపై టోల్‌ప్లాజా వద్ద పోలీసులు రాత్రి వేళల్లో ముమ్మర తనిఖీలు నిర్వహించారు. గత రాత్రి నుంచి ఆదివారం తెల్లవారుజాము వరకు వాహన చోదకులకు అవగాహన కల్పిస్తూ రోడ్డు భద్రతా చర్యలపై అవగాహన కల్పించారు. ఫేస్‌వాష్ అండ్ గో కార్యక్రమాన్ని నిర్వహించారు.

కారు ఢీకొని వ్యక్తికి గాయాలు

బేతంచెర్ల, న్యూస్‌టుడే: మండల పరిధిలోని బుగ్గానిపల్లె గ్రామ సమీపంలో ఆదివారం కారు, ద్విచక్ర వాహనాన్ని ఢీకొన్న ఘటనలో ఓ వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. వెల్దుర్తి మండలం రామళ్లకోటకు చెందిన జి. శివ మండలంలోని సిమెంట్ నగర్ గ్రామంలో ఉన్న పాణ్యం సిమెంటు ఫ్యాక్టరీలో సెక్యూరిటీ గార్డుగా పనిచేస్తున్నాడు. విధులకు ద్విచక్ర వాహనంపై వెళ్తుండగా నంద్యాల నుంచి బేతంచెర్ల వైపు వస్తున్న కారు ఢీకొట్టింది. ప్రమాదంలో శివ కుడి కాలు విరిగి తీవ్ర గాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం బేతంచెర్ల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

విద్యుత్తు సరఫరా వేళల్లో మార్పు

డోన్, న్యూస్‌టుడే: డోన్ టౌన్ సబ్‌స్టేషన్ పరిధిలోని వెంకటాపురం ఫీడర్ కింద ఆర్‌డీఎస్ఎస్ పనులు చేపడుతున్నట్లు ఏఈ నాగేశ్వరరెడ్డి తెలిపారు. ఈ నేపథ్యంలో వెంకటాపురం, గుమ్మకొండ, బొంతిరాళ్ల, అబ్బిరెడ్డిపల్లె గ్రామాల్లో ఈనెల 31, సెప్టెంబరు 1వ తేదీల్లో వ్యవసాయ విద్యుత్తు వేళల్లో మార్పులు ఉంటాయన్నారు. రాత్రి 12 గంటల నుంచి ఉదయం 6 గంటల వరకు, ఉదయం 8 గంటల నుంచి 11 గంటల వరకు సరఫరా ఉంటుందన్నారు. ఉదయం 11 గంటల నుంచి సాయంత్రం 7 గంటల వరకు విద్యుత్తు అంతరాయం ఉంటుందని, రైతులు సహకరించాలన్నారు.

సమస్యలపై అర్జీల స్వీకరణ నేడు

శిరివెళ్ల, న్యూస్‌టుడే: ఆయా గ్రామాల్లో నెలకొన్న వివిధ సమస్యల పరిష్కారానికి ప్రజల నుంచి సోమవారం అర్జీలను స్వీకరించనున్నట్లు తహసీల్దార్ విజయశ్రీ, ఎంపీడీవో శివమల్లేశ్వరప్ప పేర్కొన్నారు. ఎంపీడీవో కార్యాలయంలో నిర్వహించే ప్రజాసమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో మండల పరిధి గ్రామాల్లోని ప్రజలు తమ సమస్యలపై అర్జీలను ఇవ్వాలని సూచించారు.

తాగునీటి చౌర్యం.. చర్యలు శూన్యం

ఆళ్లగడ్డ, న్యూస్‌టుడే: ఆళ్లగడ్డలో వేల అనధికారిక కుళాయి కనెక్షన్లు ఉన్నాయి. వీటిని కట్టడి చేసేందుకు గత నాలుగేళ్లుగా చేస్తున్న ప్రయత్నాలు ఒక్క అడుగు కూడా ముందుకు సాగడం లేదు. పురపాలికలో కనీసం 50 వరకు వాటర్ సర్వీస్ సెంటర్లు ఉన్నాయి. వీటిలో ఒకటీ అరా తప్పించి ఏ ఒక్కదానికి అనుమతులు లేవు. అయినా దర్జాగా పురపాలిక నీటిని వినియోగిస్తూ వ్యాపారాలు చేసుకుంటున్నారు.

పన్ను విధింపులో విచిత్రాలు

★ ఆళ్లగడ్డ పురపాలికలో నీటి పన్ను విధింపులో విచిత్రాలు చోటు చేసుకుంటున్నాయి. కుళాయిలు ఉన్నా వాటికి పన్ను వసూళ్లులేవు. కుళాయి లేని వారికి మాత్రం పన్ను రసీదులు అందిస్తున్నారు. ఆళ్లగడ్డలో వందల కుళాయిలకు పన్ను విధించకపోవడంతో ఏటా రూ. లక్షల ఆదాయాన్ని కోల్పోతోంది.

★ ఆళ్లగడ్డలో అక్రమ కుళాయిలు వేలల్లో ఉన్నాయి. ఏటా ఒక్కో కుళాయికి రూ. 1200 చొప్పున పన్ను వసూలు చేస్తున్నారు. కమర్షియల్ కుళాయికి రూ. 2,400 వసూలు చేస్తున్నారు. ప్రతి వార్డులో సగటున 150 వరకు పన్ను విధించని కుళాయిలు ఉన్నాయంటే పరిస్థితి ఎంత దారుణంగా ఉందో ఊహించవచ్చు.



వాటర్ సర్వీసింగ్ సెంటర్ వారు అక్రమంగా ఉపయోగిస్తున్న పబ్లిక్ కుళాయి

రూ.లక్షల ఆదాయం కోల్పోతున్నా..

★ కుళాయి ఉన్నా పన్ను రసీదులు రాని దాదాపు 1,600 గృహాలను గుర్తించారు. కుళాయిలేకున్నా పన్ను వచ్చే దాదాపు 170 గృహాలను సిబ్బంది గుర్తించారు. పన్ను రాని వారిలో కొందరు నిబంధనల మేరకు కనెక్షన్ పొందేందుకు డబ్బు చెల్లించి కుళాయి పొంది నీటిని వినియోగించుకుంటున్నా ఆ వివరాలను ఆన్‌లైన్లో నమోదు చేయకపోవడంతో వారికి పన్ను రసీదులు రావడం లేదు.

★ మరికొందరు అక్రమంగా నేతలు, అధికారుల సిఫారసు మేరకు ఎలాంటి చలానా చెల్లించకుండానే కుళాయిలు వేసుకుని దర్జాగా ఒక్క రూపాయి పన్ను కూడా చెల్లించకుండా నీటిని వాడుకుంటున్నారు.

★ మొత్తం మీద అనధికారికంగా పన్నులు రాని కుళాయిలు 2,500 వరకు ఉన్నట్లు అంచనా. ఈ లెక్కన ఏటా రూ. 30లక్షల ఆదాయానికి గండి పడుతోంది. గత 15 ఏళ్లుగా కనీసం రూ. 3.5 కోట్ల ఆదాయాన్ని పురపాలక కోల్పోయిందని చెప్పవచ్చు.

★ కుళాయి ఉన్నా పన్ను రాని వాళ్లు వందల్లో ఉండగా విచిత్రం కుళాయి లేకున్నా ఉన్నట్లు చూపి పన్ను చెల్లించాలని తాఖీదులు అందుకున్న ఘటనలు కూడా వందల్లో ఉన్నాయి. తమకు కుళాయి లేకున్నా ఎలా పన్ను కట్టాలంటూ వారు వాపోతున్నారు.

వార్డులు: 27, కుళాయిలు: 8,234, గుర్తించిన అక్రమ కుళాయిలు: 1670
కుళాయి లేకున్నా పన్ను రసీదు వస్తున్నవి: 169